సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్దకు చేరుకున్న లబ్ధిదారులు



ఉత్కంఠకు తెరపడేదెప్పుడో..?

- టీడీపీలో తేలని ఎమ్మెల్యే టిక్కెట్ల వ్యవహారం..
- ఆందోళనలో కార్యకర్తలు
- రాజంపేట ఎంపీగా బాలసుబ్రమ్మణ్యం ?



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ఇక కేవలం మూడు నెలలు మాత్రమే సమయం ఉంది. జిల్లాలో అధికార పార్టీ అభ్యర్థులు ఎవరనేది ఇప్పటికే కొలిక్కి వచ్చింది. అయితే ఇంకా తెలుగుదేశం పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థుల విషయంలో అధిష్టానం స్పష్టత ఇవ్వలేదు. దీంతో జిల్లాలోని పీలేరు నియోజకవర్గం మినహా మిగిలిన నియోజకవర్గాలలో తెలుగుదేశం టికెట్ల కోసం పలువురు పోటీ పడుతున్నారు. దీంతో ఆయా నియోజకవర్గాలలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. అభ్యర్థులు ఎవరో అనే ఉత్కంఠకు తెరపడేదెప్పుడో..? అని అందరూ ఆత్రంగా ఎదురు చూస్తున్నారు. ఇదే సమయంలో టికెట్టును ఆశిస్తున్న నాయకులు సైతం ఇక్కడ కార్యకర్తలు, నాయకులకు సమాధానం చెప్పుకోలేక. హైదరాబాదు, విజయవాడల చుట్టూ తిరుగుతూ పార్టీ పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. ఇక్కడ కార్యకర్తలు అదిగో పులి.. ఇదిగో తోక అన్నట్లు.. ఇప్పుడే చంద్రబాబు చెప్పాడంట.. మా నాయకుడికే టికెట్టు, లోకేశ్ హామీ ఇచ్చాడంట.. మా నాయకుడే పోటీ చేస్తాడు.. .అంటూ హంగామా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా టీడీపీ రాజకీయం విజయవాడ, హైదరాబాదులో కేంద్రీకృతం అయిందనే చెప్పవచ్చు.

జిల్లాలో తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలు ఉన్నాయి. 2019 ఎన్నికల్లో జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలోనూ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే గెలిచారు. అయితే గత ఐదు సంవత్సరాలుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా వ్యతిరేక పాలనతో జిల్లాలో వైస్సార్ కాంగ్రెస్ ప్రతిష్ట క్రమంగా తగ్గుతూ వస్తోంది. దాదాపు అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. దీనికి తోడు చంద్రబాబు అక్రమ అరెస్టు పైనా సామాన్య జనంలో ప్రభుత్వ చర్యపై ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలో ఐప్యాక్ టీం చేపట్టిన సర్వేతో పాటు తిరుపతి జిల్లా వైసీపీలోని ఓ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నడుస్తున్న ఒక సంస్థ చేపట్టిన సర్వేలో సైతం ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా బయటపడ్డట్లు తెలిసింది. ప్రభుత్వం పుట్టి మునగడం ఖాయమని కూడా తేలినట్లు తెలిసింది. ఇవే కాకుండా అనేక సర్వే సంస్థలు సైతం సర్వే చేస్తున్నాయి. ఈ సర్వేలు అన్నింటిలోనూ సీట్ల విషయంలో కొంత తేడా ఉండవచ్చు కానీ తెలుగుదేశం-జనసేన కూటమి అధికారంలోకి రావడం స్పష్టమైనట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో జిల్లాలో అన్ని నియోజకవర్గాలలోనూ టీడీపీ టికెట్టును ఆశిస్తున్న వారి సంఖ్య పెద్దగా ఉంటోంది. ఒక్కో నియోజకవర్గంలో ఇద్దరు నుంచి నలుగు రైదుగురు సైతం టికెట్టును ఆశిస్తున్నారు. తమకున్న మార్గాలలో చంద్రబాబు, లోకేశ్‌లను ఆకర్షించేందుకు విపరీతంగా కృషి చేస్తున్నారు. ఇదే సమయంలో టీడీపీ సైతం రాబోయే ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని అభ్యర్థుల ఎంపికపైన ప్రత్యేక దృష్టి సారించింది. దీంతో పలు సంస్థల ద్వారా సర్వేలు నిర్వహిస్తోంది. రాబిన్‌శర్మ బృందం, నారా లోకేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం, పార్టీ ఆధ్వర్యంలో ఒక బృందం వేర్వేరుగా అభ్యర్థుల ఎంపికపై వడపోత చేస్తున్నాయి. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకునే అభ్యర్థుల విషయంలో నిర్ణయం తీసుకుంటారని ప్రచారంలో ఉంది.

టిక్కెట్లకై పోటాపోటీ

పీలేరు నియోజకవర్గంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డికి టికెట్‌ను ఎప్పుడో చంద్రబాబు ఖరారు చేశారు. అయితే మిగిలిన నియోజకవర్గాలలో ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ఇంకా అభ్యర్థుల ఎంపిక పూర్తి కాలేదు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌చార్జ్ శంకర్‌యాదవ్ మళ్లీ టికెట్‌ను ఆశిస్తున్నారు. ఇటీవల పార్టీలో చేరిన ప్రముఖ పారిశ్రామికవేత్త దాసరిపల్లె జయచంద్రారెడ్డి టికెట్టును ఆశిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌కుమార్‌రెడ్డి టీడీపీలోకి వస్తారనే ప్రచారం జోరుగా ఉంది. ఆయన టీడీపీలో చేరితే టికెట్‌ను ఆశిస్తారు. మదనపల్లె నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ దొమ్మలపాటి రమేశ్ టికెట్టును మళ్లీ ఆశిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి టీడీపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాష మైనార్టీ కోటాలో టికెట్టును ఆశిస్తున్నారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు బీసీ కోటాలో టికెట్టును అడుగుతున్నారు. వీళ్లందరూ తమ తమ మార్గాలలో అధినాయకులను కలుస్తూ టికెట్టు ఎలాగైనా సాధించాలని పట్టుదలతో ఉన్నారు. వీళ్లే కాకుండా ఇంకా కొందరు టికెట్టును ఆశిస్తూ.. లోలోపలే ప్రయత్నాలు చేస్తున్నారు.

రాయచోటి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రమేశ్‌రెడ్డి టికెట్టును ఆశిస్తున్నారు. టీడీపీ నాయకుడు మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి టికెట్టును అడుగుతున్నారు. మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి సైతం ఇటీవలే టీడీపీలో చేరి టికెట్టును ఆశిస్తున్నారు. వీళ్ల ఎవరికి తోచిన దారిలో చంద్రబాబు, నారా లోకేశ్‌లను కలిసి టికెట్టు కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. వీళ్లే కాకుండా మైనార్టీ కోటాలో పలువురు టికెట్టును ఆశిస్తున్నారు. బీసీ కోటాలో తమకు టికెట్టు కావాలని కొందరు చంద్రబాబు, నారా లోకేశ్‌లను కలిసి అడుగుతున్నారు. రాజంపేట నియోజకవర్గంలో టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, టీడీపీ నాయకుడు గంటా నరహరి, మేడా విజయశేఖర్‌రెడ్డి తదితరులు టికెట్టును ఆశిస్తున్నారు. అధిష్టానాన్ని మెప్పించేందుకు ఎవరి ప్రయత్నాల్లో వాళ్లు ఉన్నారు. వీళ్లే కాకుండా ఇక్కడ ఇంకా కొందరు లోలోపల టికెట్టు కోసం తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. నోటిఫికేషన్ వెలువడే నాటికి ఊహించని అనేక పరిణామాలు జరిగే అవకాశం ఉంది. రైల్వేకోడూరు నియోజకవర్గంలో టీడీపీ నాయకుడు పంతగాని నరసింహప్రసాద్ టికెట్టును ఆశిస్తున్నారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ కస్తూరి విశ్వనాథనాయుడు నగిరిపాటి రేవతి అనే మహిళా అభ్యర్థిని తెరపైకి తెస్తున్నారు. రానున్న రోజుల్లో ఇంకా మరికొందరు తెరపైకి వచ్చే అవకాశం ఉంది. కాగా పొత్తులో భాగంగా జనసేన కూడా మదనపల్లె, రైల్వేకోడూరు, రాజంపేటలలో ఏదో ఒక స్థానాన్ని తమకు కేటాయించాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో వైసీపీ తమ అభ్యర్థులను ఖరారు చేసింది. ఇప్పటికే రాజంపేటలో మేడా మల్లికార్జునరెడ్డి స్థానంలో జడ్పీ ఆకేపాటి అమర్‌నాథరెడ్డిని అభ్యర్థిగా ఎంపిక చేశారు. మదనపల్లెలో ఎమ్మెల్యే నవాజ్‌బాష స్థానంలో రిటైర్డ్ ఇంజనీర్ నిస్సార్‌అహ్మద్‌ను ఖరారు చేసింది. మిగిలిన స్థానాలు దాదాపుగా మార్చకపోవచ్చనే సమాచారం ఉంది.

ఎంపీగా బాలసుబ్రమణ్యం ?

రాజంపేట పార్లమెంటు స్థానానికి టీడీపీ తరపున మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు పెద్ద కుమారుడు సుగవాసి బాలసుబ్రమణ్యంను పార్టీ ఖరారు చేసినట్లు సమాచారం. ఇక అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. దీంతో ఇప్పటికే బాలసుబ్రమణ్యం నియోజకవర్గవ్యాప్తంగా ముమ్మరంగా పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే అభ్యర్థులను కూడా ప్రకటిస్తే కార్యకర్తల్లో ఉత్సాహం ఉరకలు వేస్తుందని చెప్పవచ్చు.

జగన్‌ది పెత్తందార్ల ప్రభుత్వమే

- పేదలకు ద్రోహం చేసిన వారిని పంపేద్దాం
- వీసీకే సత్యాగ్రహంలో మిత్రపక్షాల ఫైర్

మదనపల్లె, ఫిబ్రవరి 4: తమది పేదల ప్రభుత్వమని సీఎం జగన్ పదే పదే చెబుతున్నా..అది పెత్తందార్ల ప్రభుత్వమేనని వీసీకే పార్టీ చేపట్టిన సామాజిక సత్యాగ్రహంలో పాల్గొన్న టీడీపీ, జనసేన, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నేతలు తెలిపారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ఆదివారం వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో సామాజిక సత్యాగ్రహం పేరుతో నిరసన దీక్ష చేపట్టారు. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకూ జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా, రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామ్‌దాస్‌చౌదరి, కాంగ్రెస్ ఇన్‌చార్జ్ రెడ్డిసాహెబ్, సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, సీపీఐ నాయకుడు కె.మురళి, వాల్మీకి సంఘం ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు, తదితరులు సంఘీభావంగా దీక్షలో పాల్గొన్నారు. జగన్ సర్కారు చేస్తున్న సామాజిక విద్రోహంపై ఆయా పార్టీ నేతలు నిప్పులు చెరిగారు. సకల సామాజికవర్గాలకు అన్యాయం చేసిన జగన్ సర్కారు, సామాజిక న్యాయసాధికార యాత్ర అంటూ నిస్సిగ్గుగా ఊరేగుతోందని వారు ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో పేద, మధ్యతరగతి వర్గాలకు తీరని అన్యాయం జరిగిందని, నాలుగున్నరేళ్లుగా చేస్తున్న దగాపై పేదల ధర్మాగ్రహాన్ని ఈ ప్రభుత్వానికి తెలియచేయడానికే సామాజిక సత్యాగ్రహం చేపట్టినట్లు వెల్లడించారు. నేటి నుంచి జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో సమస్యలు పరిష్కరించాలని కొన్ని డిమాండ్స్‌ను ప్రకటించారు. ఇందులో ప్రభుత్వ వసతిగృహాల్లోని విద్యార్థులకు కడుపునిండా తిండి పెట్టేందుకు మూడు, నాలుగు తరగతుల విద్యార్థులకు నెలకు రూ.2 వేలు, అయిదు నుంచి పదో తరగతులకు రూ.3 వేలు, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు నెలకు రూ.4 వేలు, పీజీ, ఆపై చదువుల వారికి రూ.5 వేలు మెస్ చార్జీలు పెంచాలని, కొత్తగా ప్రభుత్వం ఆర్టీసీకి అద్దెకు తీసుకుంటున్న 954 బస్సులు ఎస్సీ, ఎస్టీ నుంచే తీసుకునేలా ప్రత్యేక నోటిఫికేషన్ ఇవ్వాలని, పేదలకు మూడు సెంట్ల ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలని, 300 జనాభా దాటిన దళితవాడలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సత్యాగ్రహంలో వీసీకే నేతలు యు.గణపతి, ముత్యాల మోహన్, డాక్టర్ ప్రభు, పి.శ్రీనివాసులు, బాస్ నాయకులు పోతబోలు రెడ్డెప్ప, పల్లం తాతయ్య, బురుజు లక్ష్మినారాయణ, సచిన్, బాలకృష్ణ, టి.ఎ.పీర్‌బాషా, రవిశంకర్, రెడ్డిప్రసాద్, రాయల్ సూరి, తలారి కృష్ణ, క్రాంతి, జనార్ధన్, గంగాధర్, చంద్ర, రమణ, సీపీఐ కృష్ణప్ప, సాంబశివ, తదితరులు పాల్గొన్నారు.



నిరసన దీక్షలో జనసేన నేత రామ్‌దాస్‌చౌదరి, టీడీపీ, కాంగ్రెస్, సీపీఎం నేతలు

మాతో ఆడుకుంటున్నారా...!

- రిజిస్ట్రేషన్ చేస్తామంటూ తిప్పుకుంటారా...
- జగనన్న కాలనీల లబ్ధిదారులతో అధికారుల ఆటలు..
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి లబ్ధిదారుల పరుగులు
- సచివాలయాల్లోనే చేయించుకోవాలని చెప్పిన అధికారులు
- అధికారులు, సిబ్బందిపై లబ్ధిదారుల ఆగ్రహం

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 4: అధికారులు మాతో ఆడుకుంటున్నారా.. జగనన్న ఇళ్లను రిజిస్ట్రేషన్ చేస్తామంటూ సచివాలయాలు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు తిప్పుకుంటారా అని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం రాయచోటి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్ల రిజిస్ట్రేషన్ చేస్తామంటూ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది చెప్పడంతో ఒక్కసారిగా వందలాదిమంది లబ్ధిదారులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి క్యూకట్టారు. దీంతో అక్కడ గందరగోళ వాతావరణం ఏర్పడింది. ఉదయం నుంచి పడిగాపులు కాసిన వారికి తీరా అధికారులు చావు కబురు చల్లగా చెప్పారు. ఇక్కడ రిజిస్ట్రేషన్లు చేయమని, సచివాలయాల్లోనే చేస్తారని అక్కడికి వెళ్లాలని రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది చెప్పడంతో లబ్ధిదారులు ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి వారిని శాంతింపచేశారు. జగనన్న కాలనీల్లోని ఇంటి పట్టా పొందిన లబ్ధిదారులకు ఉచితంగా గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ చేయించి పత్రాలు మీ చేతికి అందిస్తామని ప్రభుత్వం చెప్పడంతో లబ్ధిదారులు గ్రామ సచివాలయాలకు ఎగబడ్డారు. అయితే గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల అవగాహనారాహిత్యం కారణంగా గత వారం రోజులుగా జగనన్న కాలనీల లబ్ధిదారులు నానా అవస్థలు పడుతున్నారు. గ్రామ సచివాలయాల్లో ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయిస్తామని చెప్పిన ప్రభుత్వం వారం రోజులుగా వారిని సచివాలయాల చుట్టూ తిప్పుకుంటూ సర్వర్ పనిచేయడం లేదంటూ అధికారులు చెప్పుకొచ్చారు. అయితే రాయచోటి మండలంలోని పలు గ్రామ పంచాయతీలకు చెందిన సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఆదివారం రాయచోటి పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రిజిస్ట్రేషన్లు చేస్తారని చెప్పడంతో వందలాది మంది జగనన్న కాలనీల లబ్ధిదారులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ముఖ్యంగా రాయచోటి మండల పరిధిలోని చెన్నముక్కపల్లె, శిబ్యాల, యండపల్లె, మాధవరం, దిగువ అబ్బవరం తదితర గ్రామ పంచాయతీల్లోని జగనన్న కాలనీలకు చెందిన మహిళలు చిన్న పిల్లలను తీసుకుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకోవడంతో అక్కడ గందరగోళ వాతావరణం నెలకొంది. ఒక దశలో పోలీసులు రంగప్రవేశం చేసి లబ్ధిదారులకు సర్దిచెప్పాల్సిన పరిస్థితి నెలకొంది. మిమ్మల్ని ఇక్కడికి ఎవరు పంపించారని, మీరు వెళ్లి మీ గ్రామ పరిధిలో గల సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు లబ్ధిదారులకు చావు కబురు చల్లగా చెప్పారు. దీంతో ఆగ్రహించిన లబ్ధిదారులు ఉదయం నుంచి కార్యాలయం వద్ద పడికాపులు కాస్తున్నామని, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు మమ్మల్ని ఇక్కడికి ఎందుకు రమ్మన్నారంటూ అధికారులపై మండిపడ్డారు. రిజిస్ట్రేషన్ చేయిస్తామంటే చేయించండి లేదంటే లేదని చెప్పండి ఇలా మమ్మల్ని తిప్పుకోవడం మంచిది కాదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సబ్ రిజిస్ట్రార్ గురుస్వామి మీడియాతో మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల అవగాహనారాహిత్యం కారణంగా లబ్ధిదారులు ఇబ్బందులకు గురయ్యారని, ప్రస్తుతానికి సర్వర్ పనిచేయడం లేదని, వారి పరిధిలోని సచివాలయంలోనే రిజిస్ట్రేషన్ జరుగుతుందని లబ్ధిదారులు సహనం పాటించాలని, రిజిస్ట్రేషన్‌కు సమయం చాలా ఉందని, ఎవరూ ఆందోళనపడాల్సిన అవసరం లేదని తెలిపారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని లబ్ధిదారులతో మాట్లాడి అక్కడ నుంచి ఇంటికి పంపించి వేశారు. ఈ విషయమై వలంటీర్లను లబ్ధిదారులు నిలదీయగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లల చేస్తారని మీకు చెప్పమని మాకు సచివాలయ సెక్రటరీలు చెప్పారని వారికి తెలియచేశారు.

చిన్నపిల్లలతో పడిగాపులు కాయాల్సి వచ్చింది

- జగనన్న కాలనీల లబ్ధిదారులు

ఆదివారం రోజు సెలవు దినం అయినప్పటికీ రాయచోటి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద జగనన్న కాలనీల లబ్ధిదారులకు ఉచితంగా రిజిస్ట్రేషన్ కార్యక్రమం ఉందని సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు చెప్పడంతో వారి మాటలను నమ్మి మోసపోయి ఉదయం టిఫిన్ కూడా తినకుండా పరుగు పరుగున చిన్నపిల్లలతో సహా ఇక్కడికి వచ్చాం. తీరా ఇక్కడికి వస్తే అధికారులు మాత్రం సర్వర్ పనిచేయడం లేదని, మమ్మల్ని ఇక్కడికి ఎవరు రమ్మన్నారని, మీ సచివాలయం పరిధిలోనే రిజిస్ట్రేషన్లు చేయించుకోండి అంటూ చెప్పడం బాధాకరంగా ఉంది. అధికారులు మా జీవితాలతో ఆడుకుంటున్నారని, సౌకర్యాలు లేని చోట పట్టాలిస్తే అప్పులు చేసి ఇళ్లు కట్టుకున్నాం. తీరా ఇప్పుడు రిజిస్ట్రేషన్ చేయిస్తామంటూ సచివాలయాల చుట్టూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం చుట్టూ తిప్పుతూ మా జీవితాలతో ఆడుకుంటున్నారని జగనన్న కాలనీల లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు చొరవ చూపి రిజిస్ట్రేషన్లు త్వరగా చేయించి మమ్మల్ని ఆదుకోవాలని వేడుకుంటున్నారు.





రాయచోటి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పడికాపులు కాస్తున్న జగనన్న కాలనీల లబ్ధిదారులు, (ఇన్‌సెట్లో) మీడియాతో తమ గోడు తెలుపుతున్న జగనన్న కాలనీల లబ్ధిదారులు

కోట్లు పెట్టి గాలికి వదిలేశారు..

- ప్రభుత్వానికి పట్టని రైతులు..
- వృథాగా రెండు మార్కెట్‌లు
- వ్యవసాయ మార్కెట్ల తీరు ఇదీ..



చింతపర్తి మార్కెట్‌లో నిరుపయోగంగా వ్యాపార దుకాణాల సముదాయం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 4: రైతుల ప్రయోజనాల కోసం గత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం నిర్మించిన మార్కెట్‌యార్డులు నేడు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాల్మీకిపురం సమీపంలోని మర్రిపాడు మార్గంలో 2013వ సంవత్సరంలో అప్పటి సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి రూ.3.40 కోట్ల వ్యయంతో నూతన వ్యవసాయ మార్కెట్ యార్డును ప్రారంభించారు. రాష్ట్రంలోనే మోడల్ మార్కెట్‌గా రూపుదిద్దుకోవాలన్న అప్పటి ప్రభుత్వం, పాలకుల ఆశలు నీరుగారాయనే చెప్పాలి. తరువాత వచ్చిన ప్రభుత్వాలు, పాలకులు రైతుల సౌకర్యాలు, అవసరాలు గుర్తించకపోవడంతో నేడు మార్కెట్ శిథిలాలను తలపిస్తోంది. వాల్మీకిపురం మార్కెట్ ప్రారంభించిన తొలినాళ్లలో వాల్మీకిపురం, కలకడ మండల ప్రాంతాల నుంచి ప్రతి నిత్యం సుమారు 150 టన్నుల టమోటాలు మార్కెట్‌కు రావడం క్రయ, విక్రయాలతో సందడి వాతావరణం ఉండేది. క్రమేపీ ఇక్కడి మార్కెట్లో రైతులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. మండలం వ్యాప్తంగా సుమారు వెయ్యి ఎకరాలలో టమోటా సాగవుతూ నిత్యం రైతులు, వ్యాపారుల సందడితో కళకళలాడే మార్కెట్ నేడు వెలవెలపోతోంది. అత్యాధునిక ప్రమాణాలతో నిర్మించిన భవనాలు కూడా వృథాగా మారాయి. రైతుల విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు ఉపయోగంలోకి తెచ్చిన పాపాన పోలేదు. ఒక్క రైతు కూడా రాకపోవడంతో ఇది మార్కెటేనా అన్న సందేహాలు నెలకొన్నాయి. రూ.10 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ కూడా మరుగున పడింది. కనీస సౌకర్యాలు లేకనే రైతులు వాల్మీకిపురం మార్కెట్‌కు రావడం లేదన్న వాదన గట్టిగా వినిపిస్తుండటం గమనార్హం. ఎటువంటి రక్షణ లేకపోవడంతో మార్కెట్ మందుబాబులు, అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయింది.

అలాగే మండలంలోని చింతపర్తి గ్రామంలోని మార్కెట్ యార్డు కూడా దుస్థితికి చేరుకుంది. రైతుల ఉపయోగం ఎలా ఉన్నా ఎవరికి తోచిన రీతిలో వారు వాడుకుంటున్నారు. మార్కెట్ కార్యాలయం భవనాలు కూడా అక్రమ నిల్వల గోదాముగా మారిపోవడం గమనార్హం. ఎటు చూసినా మందుబాబుల ఆగడాలతో మద్యం సీసాలు, దుర్గంధం తాండవిస్తోంది. రూ.1.57 కోట్లతో నిర్మించిన మార్కెట్ యార్డు ప్రస్తుతం ఎటూ కాకుండా నిరుపయోగంగా మారింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా గత నాలుగన్నర సంవత్సరాలుగా వ్యవసాయ మార్కెట్‌లను పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. చింతపర్తి మార్కెట్ అనుకూలంగా ఉండేదని ప్రస్తుతం నడవకపోవడంతో కలకడ మార్కెట్‌కు వెళ్లాల్సి వస్తోందని సమీప గ్రామాల రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ల తీరుతో మండీల యజమానులు కూడా తాము వ్యాపారాలు కోల్పోయి ప్రతినెలా చేతి నుంచి బాడుగలు కట్టే పరిస్థితులు నెలకొన్నాయని ఆరోపిస్తున్నారు. రైతులకు కనీస సౌకర్యాల కల్పన లేని మార్కెట్లు తమ ప్రాంతాలలో ఉండటం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపి మార్కెట్ సముదాయాలలో సౌకర్యాల కల్పన, పూర్వ వైభవం తీసుకురావాలని కోరుతున్నారు.

మార్కెట్ లేక ఇబ్బందులు..



చింతపర్తి వ్యవసాయ మార్కెట్ లేకపోవడంతో కలకడ, కలికిరి, మదనపల్లె ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. పైగా టమోటా రవాణా ఖర్చులు కూడా భారంగా మారాయి. ప్రభుత్వం చింతపర్తి మార్కెట్ యార్డును తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

-ఎన్.వెంకటరమణ, రైతు, పెరుమళ్లయ్యగారిపల్లె, వాల్మీకిపురం.

బాడుగలు భరిస్తున్నాం..



వాల్మీకిపురంలో మార్కెట్ నడవక మండీ గదుల బాడుగలు చేతి నుంచి భరిస్తున్నాం. మార్కెట్ అధికారులు ఇప్పటికైనా స్పందించి రైతులకు, వ్యాపారులకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. మళ్లీ మార్కెట్‌కు పూర్వ వైభవం తేవాలని కోరుకుంటున్నాం.

-రామచంద్ర, మండీ యజమాని, వాల్మీకిపురం.

మార్కెట్ల సమస్యలు పరిష్కరిస్తాం..

వాల్మీకిపురం, చింతపర్తి మార్కెట్ యార్డుల సమస్యలన్నింటినీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తప్పక పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. ఈ ఏడాది టమోటా సీజన్ ప్రారంభం నాటికి మార్కెట్లలో వసతులు, రైతులకు అన్ని సౌకర్యాలు ఉండేలా చూస్తాం. రైతుల ఆసక్తి మేరకు వ్యాపారాలు కొనసాగేలా చర్యలు తీసుకుంటాము. ఇకపై ఎప్పటికప్పుడు మార్కెట్ యార్డుల స్థితిగతులను పర్యవేక్షిస్తాం.

-కుమార్‌రెడ్డి, సెక్రటరీ, వ్యవసాయ మార్కెట్, వాల్మీకిపురం.



వాల్మీకిపురం మార్కెట్ యార్డు



వాల్మీకిపురం మార్కెట్‌లో శిథిలావస్థకు చేరుకున్న రైతుల విశ్రాంతి గదులు



వాల్మీకిపురం మార్కెట్లో మద్యం బాటిళ్లు

అప్పుల బాధతో రైతు మృతి


మారెన్న మృతదేహం

మైలవరం, ఫిబ్రవరి 4: పొన్నంపల్లి గ్రామానికి చెందిన నల్లసింగ్ మారెన్న (40) అనే రైతు అప్పులు తీర్చలేక మనస్థాపం చెంది ఇంట్లోనే పురుగుల మందుతాగి ఆత్మ హత్య చేసుకున్నట్లు మైలవరం ఎస్‌ఐ రెడ్డిసురేశ్ ఆదివారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు... మారెన్నకు 3.75 ఎకరాల పొలం ఉండగా పంటలు సరిగా పండక పోవడంతో గత ఏడాది ఎకరా పొలం అమ్మారన్నారు. కానీ ఈ ఏడాది కూడా పంట దిగుబడులు సరిగా రాక పోవడం, దానికి తోడు మద్యానికి బానిసైన మారెన్న అప్పులు తీర్చలేమోనని భయంతో ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మారెన్న భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


సుబ్రమణ్యం మృతదేహం

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 4: పొలానికి వేసిన విద్యుత్ కంచె తగిలి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... అనంతరాజుపేట పంచాయతీ బంగ్లా మిట్టకు చెందిన తుపాకుల సుబ్రమణ్యం అలియాస్ ఛత్రపతి (35) వేటకు వచ్చి కొర్లకుంట పరిసరాల్లో పొలాలకు వేసిన కంచెకు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. భార్య శాంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ చిన్న పెద్దయ్య తెలిపాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

నెలకు రూ.50 వేలు సంపాదించాలి

రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 4: రైతు శాస్త్రవేత్తలు ప్రతి నెలా తమ పొలం ద్వారా ఎకరాకు రూ.50 వేలు సంపాదించాలని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం అకాడమీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు శాస్త్రవేత్తలు రైతులందరికీ దిక్సూచిగా నిలవాలని, గ్రామాలను పర్యావరణరహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని అన్నారు. సిలబస్ గాని, టెక్ట్స్‌బుక్స్ గాని లేని ఏకైక కోర్సు ఫార్మర్ సైంటిస్టు కోర్సు అని, ప్రధానంగా రైతు శాస్త్రవేత్తలు తమ వ్యవసాయ క్షేత్రంలో చేసే ప్రయోగాలే కోర్సులో ప్రాధాన్యత సంతరించుకుంటాయన్నారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ సీనియర్ థిమాటిక్ లీడ్ జాకీర్, థియాటిక్ లీడ్‌లు సుధాకర్, విపి, సురేష్, ప్రాజెక్టు మేనేజర్ స్వాతి, వీఎస్‌ఆర్ కడప జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణరాజు, అకాడమీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శివారెడ్డి, అకాడమీ అధికారులు సందీప్, శుభాకర్, సొహైల్, అచ్యుతన్, జిల్లా పాయింట్ పర్సన్స్, థిమాటిక్ పాయింట్ పర్సన్స్ పాల్గొన్నారు.

జర్మన్ ప్రభుత్వ ప్రతినిధుల పరిశీలన : ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న ఆగ్రో ఎకాలజీ కార్యక్రమాలను పరిశీలించి బలోపేతం చేసే ప్రణాళికలను రూపొందించడం కోసం రాష్ట్రంలో పర్యటిస్తున్న జర్మన్ ప్రభుత్వ ప్రతినిధులతో పాటు ఇతర అంతర్జాతీయ సంస్థలకు చెందిన ప్రతినిధి బృందం పులివెందులలోని ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీ ఫర్ ఆగ్రో ఎకాలజీ రిసెర్చ్ అండ్ లెర్నింగ్ సెంటర్ (ఐజీజీఏఏఆర్ఎల్-అకాడమీ)ను సందర్శించింది. బీఎంజడ్ సీనియర్ పాలసీ అడ్వైజర్ క్రిస్టోఫ్ వాన్ స్టెచో, సీనియర్ పాలసీ ఆఫీసర్ అలెగ్జాండర్ లింగెంతాల్, కేఎఫ్‌డబ్ల్యూ కంట్రీ మేనేజర్ జోష్కా గ్రేవ్, సీనియర్ సెక్టార్ స్పెషలిస్ట్ సంతీగ అగర్వాల్, ఎన్విరాన్‌మెంట్ క్లైమేట్ చేంజ్ అండ్ బయోడైవర్సిటీ విభాగం క్లస్టర్ కో-ఆర్డినేటర్ మహమ్మద్ ఎల్.ఖవాద్, జీఐజడ్ న్యాచురల్ రీసోర్స్ మేనేజ్‌మెంట్, ఆగ్రో ఎకాలజీ డైరెక్టర్ రాజీవ్ అహల్, ప్రాజెక్టు హెడ్ ఫర్ ఆగ్రో ఎకాలజీ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాసెస్ యూటే రిక్మాన్‌లు బృందంలో ఉన్నారు. అనంతరం అకాడమీ ప్రాంగణంలోఅంతర్జాతీయ బృందం సభ్యులు మొక్కలు నాటారు.

భర్తతో కలిసి తల్లిని కడతేర్చిన కూతురు


మృతి చెందిన యర్రక్క

వాల్మీకిపురం, ఫిబ్రవరి 4: భర్తతో కలిసి తల్లిని హత్య చేసిన ఓ కూతురి ఉదంతం బట్టబయలైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అనంతపురం జిల్లా కనేకల్ ప్రాంతానికి చెందిన యర్రక్క (43) వాల్మీకిపురం ఇందిరమ్మ కాలనీలో తన కుమార్తె నందిని, శివరాంలతో కలిసి నివాసం ఉంటూ కూలిపనులు చేసుకుని జీవనం సాగిస్తోంది. కుటుంబం కలహాల నేపథ్యంలో శనివారం రాత్రి నందిని, తన భర్త శివరాం కలిసి తల్లి యర్రక్కతో గొడవపడ్డారు. అదే సమయంలో ఇనుపరాడ్‌తో యర్రక్కను కొట్టి గాయపరిచారు. గట్టిగా కేకలు విన్న సమీప వాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. యర్రక్కను ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందింది. స్థానిక ఎస్‌ఐ నాగేశ్వర్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సోమల ప్రాంతం వైపు వెళ్లిపోయిన ఏనుగులు

కలికిరి, ఫిబ్రవరి 4: వాల్మీకిపురం, కలికిరి మండలాల సరిహద్దు గ్రామాల్లో రెండు రోజుల పాటు కలకలం సృష్టించిన రెండు గున్న ఏనుగులు ఆదివారం సాయంకాలానికి ఇక్కడి నుంచి సోమల వైపు వెళ్లిపోయాయి. ఈ విషయాన్ని అటవీ శాఖాధికారులు కూడా ధృవీకరించారు. చిత్తూరు జిల్లాలోని సోమల మండలానికి చెందిన నంజంపేట, రాంపల్లె, ఆవులపల్లె, సింగిరిగుంట, ఇరికిపెంట గ్రామాల పరిధిలోని మధురమల్లై రిజర్వు ఫారెస్టు ప్రాంతాలకు చేరుకున్నాయని సమాచారం. దీంతో వాల్మీకిపురం, కలికిరి సరిహద్దు గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ గ్రామాల్లోని అటవీ ప్రాంతాల్లో తిరుగాడిన ఈ రెండు గున్న ఏనుగులు చెప్పుకోదగ్గ నష్టమేమీ కల్పించకపోవడం ఊరట కలిగించే అంశంగా చెబుతున్నారు. కాగా మేకలవారిపల్లె పరిసరాల్లో నిల్వ ఉంచిన సారా, సారా ఊటను మాత్రం తాగేశాయని చెబుతున్నారు. అంతకు మించి పంటలకు ఎలాంటి నష్టం కూడా కలిగించలేదు. సోమల అటవీ ప్రాంతంలో ఉన్న ఏనుగుల గుంపు నుంచి ఈ రెండు గున్న ఏనుగులు కలికిరి, వాల్మీకిపురం సరిహద్దు గ్రామాల్లోని అటవీ ప్రాంతంలోకి చొరబడినట్లు ఆ శాఖ అధికారులు భావిస్తున్నారు. ఆదివారమంతా మేకలవారిపల్లె, ఇట్లంవారిపల్లె కొత్తపల్లె ప్రాంతాల్లో సంచరించిన ఏనుగులు గుట్టపాళెం పంచాయతీ ఆచార్ల గొల్లపల్లె వైపు నుంచి సోమల అటవీ ప్రాంతంలోకి వెళ్లినట్లు అధికార వర్గాల సమాచారం. మొత్తం మీద ఇదివరకెప్పుడూ ఇటువైపు రాని ఏనుగులు అకస్మాత్తుగా రెండు రోజులపాటు కనిపించి పరిసర గ్రామాల్లో అలజడి కలిగించాయి.

పునాదులకే పరిమితం

- అర్ధంతరంగా ఆగిన మోడల్ స్కూల్ నిర్మాణం
- వెనక్కి వెళ్లిన రూ.5కోట్ల నిధులు
- మౌలిక వసతులు లేక అవస్థలు పడుతున్న విద్యార్థులు


పునాది దశలో నిలిచిపోయిన మోడల్ పాఠశాల భవనం

సంబేపల్లె, ఫిబ్రవరి 4: జిల్లా వ్యాప్తంగా మోడల్ స్కూల్ భవన నిర్మాణాలు పూర్తి చేసినా సంబేపల్లె మండలంలో పునాదులకే పరిమితం అయ్యాయి. సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదర్శ పాఠశాల నిర్వహిస్తున్నారు. ఇక్కడ 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 453 మంది చదువుకుంటున్నారు. రెండు పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులు 1000 మందిపైగా ఉన్నారు. కనీస మౌలిక వసతులు లేక బాలికలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరగతి గదులు సరిపోక చెట్ల కిందనే పాఠాలు బోధిస్తున్నారు. ఆదర్శ పాఠశాల భవన నిర్మాణ పనులు కాంట్రాక్టర్ నిలిపేయడం, అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో నిర్మాణాలు పునాదులకే పరిమితం అయ్యాయి. దీంతో పాఠశాలకు వచ్చిన నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే వచ్చిన డబ్బులు వెనక్కి వెళ్లిపోయాయని పిల్లల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. నాడు- నేడు కింద నిధులు మంజూరైనా పనులు చేయకపోవడంతో వచ్చిన నిధులను వివిధ పాఠశాలలకు తరలించారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆంగ్ల విద్యను అందించేందుకు 2014లో అప్పటి ప్రభుత్వం మోడల్ పాఠశాలలను మంజూరు చేసింది. ఏపీఈడబ్ల్యుఐడీసీ నిధుల కింద ఒక్కో దానికి రూ.5 కోట్లతో పాఠశాల భవనం, విద్యార్థులకు వసతితో కూడిన భవనాలను ఏర్పాటు చేసే విధంగా టెండర్లు పిలిచారు. అన్నమయ్య జిల్లాలో 17 మోడల్ పాఠశాలలు ఉండగా ఇప్పటికే రాయచోటి నియోజకవర్గంలో రాయచోటి, చిన్నమండెం, గాలివీడు, రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలాల్లో సంబంధిత కాంట్రాక్టర్లు పనులు పూర్తిచేశారు. సంబేపల్లె మోడల్ పాఠశాల పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఈ పనులు పునాది దశలోనే నిలిపివేయడంతో మంజూరైన రూ.5 కోట్ల నిధులు వెనక్కి వెళ్లిపోయాయి.

ఈ పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వరకు 453 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. మౌలిక వసతులైన తాగునీరు, మరుగుదొడ్లు విద్యార్థులకు, సరిపడా గదులు లేక అవస్థలు పడుతున్నారు. కొంత మంది దాతల సహకారంతో కొన్ని షెడ్లు నిర్మించుకున్నారు. మోడల్ పాఠశాల భవన నిర్మాణ పనులు పునాది దశలోనే ఆగిపోవడంతో నాడు-నేడు కింద రూ.2.70 కోట్లు మంజూరయ్యాయని పాఠశాల ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం రూ.39 లక్షలు నాడు- నేడు కింద ఖాతాకు జమ అయ్యాయన్నారు. ప్రస్తుతం ఆదర్శ పాఠశాలతో పాటు సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఒకే ఆవరణలో ఉండడంతో మరుగుదొడ్లు, పాఠశాల ప్రహరీ నిర్మాణానికి అదనంగా రూ.36 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ పనులను చేయకపోవడంతో ఉన్న నిధులు వివిధ పాఠశాలలకు తరలించినట్లు తెలిపారు.


పాఠశాల వద్ద ఉన్న బోరు


పాఠశాల కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్


గదుల కొరతతో చెట్ల కింద బోధిస్తున్న ఉపాధ్యాయులు

జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలి..



అన్నమయ్య జిల్లాలో 17 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. ప్రతి మండలంలో ఈ భవనాలు పూర్తి చేశారు. ఇప్పటివరకు సంబేపల్లె మండలంలో పూర్తి కాలేదు. వచ్చిన నిధులతో కమిటీ ఆధ్వర్యంలో పనులు చేపట్టేందుకు ప్రయత్నించినా అడ్డుకుంటున్నారు. పనులు పూర్తి చేసేలా లేరు. దీంతో విద్యార్థులకు సరిపడే వసతులు కల్పించలేకున్నాం. జిల్లా అధికారులు పనులు పూర్తి చేసి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి.

- దిలీప్‌కుమార్, ప్రిన్సిపాల్, మోడల్ స్కూల్, సంబేపల్లె

టీడీపీతోనే సంక్షేమం, అభివృద్ధి : పుత్తా


కొండపేటలో టీడీపీ నేత పుత్తా సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

చెన్నూరు, ఫిబ్రవరి 4 : టీడీపీని గెలిపించి ప్రతి ఇంటికీ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందుకోవాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. మండలంలోని కొండపేటలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ మన్నె మోహన్‌రెడ్డి, జిల్లా రైతు విభాగం కార్యదర్శి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలోని ప్రతి ఇంటికీ తిరిగి టీడీపీని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలని చెబుతూ సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. నాలుగున్నరేళ్ల పాలనలో ఎన్నిమార్లు కరెంటు చార్జీలు పెరిగాయి, నిత్యావసర ధరలు ఎంతవరకు పెరిగాయి, చివరికి ప్రయాణం చేసేందుకు కూడా బస్సు చార్జీలు మూడురెట్లు పెంచారన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని ప్రజలు ఇంటికి పంపాలని పిలుపునిచ్చారు. కొండపేటలో పుత్తాకు ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు.

100 కుటుంబాలు టీడీపీలో చేరిక : గతంలో వైసీపీని ఆదరిస్తూ ఆ పార్టీకి మేం అండదండగా ఉన్నామని చెప్పుకునే వందకు పైగా కుటుంబాలు పుత్తా సమక్షంలో టీడీపీలో చేరారు. గ్రామ టీడీపీ సీనియర్ నేత ఎస్.చిన్నిక్రిష్టారెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 50 కుటుంబాలు, తరువాత అదే గ్రామంలో మరో 50 కుటుంబాలు టీడీపీలో చేరారు. వారందరికీ పుత్తా పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. వారంతా తాము టీడీపీ వెన్నంటే ఉంటామని, రాబోవు ఎన్నికల్లో తమ సత్తా చూపి టీడీపీ గెలుపు కోసం పాటుపడతామన్నారు.

కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాషు, టీడీపీ నేతలు సంజీవ్‌పవన్, ఉండేల బాలక్రిష్టారెడ్డి, జిల్లా బలిజ సంఘం నాయకులు ఆకుల ప్రసాద్‌బాబు, మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్ ఐ.శివారెడ్డి, జిల్లా మైనార్టీ నేత షబ్బీర్‌హుసేన్, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి మల్లికార్జునరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రామక్రిష్టారెడ్డి. జిల్లా కార్యదర్శి పవన్, తెలుగుయువత అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, జనసేన జిల్లా నేత ఇందిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, తెలుగుయువత అధ్యక్షుడు పాలగిరి సుదర్శన్ రెడ్డితో పాటు శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మోచంపేటలో టీడీపీ స్టిక్కర్ల తొలగింపు

వైసీపీ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ డివిజన్ ఇన్‌చార్జ్ నాయబ్

కడప(ఎర్రముక్కపల్లె) జనవరి 4: కడప నగరం మోచంపేటలో టీడీపీ నాయకులు అతికించిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ స్టిక్కర్లను వైసీపీ నాయకులు తొలగించారని టీడీపీ 31వ డివిజన్ ఇన్‌చార్జ్ నాయబ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం 31వ డివిజన్ మోచంపేటలో గడప గడపకు వైసీపీ ప్రభుత్వం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా ప్రచారం చేస్తుండగా వైసీపీ కార్యకర్తలు టీడీపీకి చెందిన స్టిక్కర్లు తొలగించడంతో స్థానిక ఇన్‌చార్జ్ నాయబ్ వెళ్లి అడ్డుకునేందుకు ప్రయత్నించగా అతడిపై వైసీపీ కార్యకర్తలు విరుచుకుపడినట్లు సమాచారం. అలాగే తనకు వస్తున్న సంక్షేమ పథకాలను కట్ చేస్తామని స్థానిక కార్పొరేటర్ తనను హెచ్చరించినట్లు నాయబ్ తెలిపారు. ఈ విషయంపై టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి నాయబ్‌తో కలిసి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ స్టిక్కర్లు చించినంతమాత్రాన ప్రజల్లో టీడీపీకి ఉన్న అభిమానం పోదన్నారు. ఫ్లెక్సీలు చించడం, దర్పాషలాడటం ఉప ముఖ్యమంత్రి స్థాయికి తగదన్నారు. ఓటమి భయంతోనే ఆయన ఇలా చేస్తున్నారన్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా టీడీపీ కార్యకర్తలు భయపడే ప్రసక్తే లేదన్నారు.

నిత్య సహాయ తల్లి లూర్దుమాత




దైవసందేశం ఇస్తున్న ఫాదర్ ప్రసాద్, హాజరైన విశ్వాసులు

కడప (కల్చరల్), ఫిబ్రవరి 4: లూర్దుమాతను ప్రార్థించిన ప్రతీ ఒక్కరికీ ఆ తల్లి సహాయపడుతుందని, అందుకే ఆ తల్లి నిత్య సహాయమాతగా విశ్వాసుల మన్ననలు పొందుతోందని ఫాదర్ ఆకుల ప్రసాద్ కొనియాడారు. మరియాపురం లూర్దుమాత తిరుణాల నవదిన మహోత్సవాలను పురస్కరించుకుని మూడవ రోజైన ఆదివారం స్థానిక మరియాపురం చర్చి ఆవరణంలో ఫాదర్ గుడిమే జేసుదాస్ (అమెరికా) దివ్యబలిపూజ సమర్పించారు. అనంతరం ఆకుల ప్రసాద్ లూర్దుమాత దివ్యసందేశం ఇచ్చారు. సాటి మనిషిని నమ్మినవారికి సహాయం అందవచ్చు, అందకపోవచ్చునేమో కానీ లూర్దుమాతను సహాయం అర్థించిన వారికి తప్పక సహాయం అందుతుందని తెలిపారు. అందుకు విశ్వాసులే సాక్ష్యమన్నారు.

కావున విశ్వాసులు ఆ తల్లికి విధేయులుగా జీవించాలని కోరారు. కార్యక్రమంలో విచారణ గురువులు ఫాదర్ బిరుసు రాజా, సహాయ గురువు ఫాదర్ అరుణ్, ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ ప్రసాదరావు, విశ్వాసులు పాల్గొన్నారు.

మత్స్యశాఖలో సిబ్బంది కొరత

- వర్క్ అడ్జెస్ట్‌మెంటు పేరుతో బదిలీలు
- అధికారుల కొరతతో చెలరేగుతున్న అక్రమార్కులు
- నిషేధిత వలలతో చేపల వేట

కడప (ఎన్టీఆర్ సర్కిల్), ఫిబ్రవరి 4: ముఖ్యమంత్రి సొంత జిల్లా కడపలో మత్స్యశాఖలో సిబ్బంది కొరత వేధిస్తోంది. కొన్ని రోజులుగా ఆ శాఖకు సంబంధించి పర్మినెంటు అధికారులు లేకపోవడంతో మత్స్య సంపద అభివృద్ధితో పాటు మత్స్యకారుల సమస్యలు కూడా అపరిష్కృతంగానే ఉన్నాయి. రెగ్యులర్ అధికారులుగా ఉన్న డిప్యూటీ డైరెక్టరు రెడ్డిబాబును వర్క్ అడ్జెస్ట్‌మెంటు పేరుతో విజయవాడకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో శాంతి అనే అధికారిణిని అనంతపురం నుంచి కడపలో నియమించారు. అసిస్టెంటు డైరెక్టరుగా కడపలో పనిచేస్తున్న రెడ్డయ్యను ఇక్కడ నుంచి విజయవాడకు బదిలీ చేశారు. మత్స్య అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాల్సిన మత్స్య అభివృద్ధి అధికారుల ఖాళీలు కూడా సుదీర్ఘంగా నియామకానికి నోచుకోలేదు. జిల్లాలో కడప, మైలవరం, బి.మఠంలలో ముగ్గురు మత్స్య అభివృద్ధి అధికారులు ఉండాల్సి ఉండగా, కొంతకాలంగా మైలవరం పోస్టు ఖాళీగానే ఉంది. బి.మఠం మత్స్య క్షేత్రంలో పనిచేస్తున్న మద్దిలేటిని కర్నూలు జిల్లా సుంకేసులకు బదిలీ చేశారు. దీంతో జిల్లా అంతటికీ కడపలో పనిచేస్తున్న కిరణ్‌కుమార్ అనే ఎఫ్‌డీవో ఒక్కరే శాఖాపరమైన పనులను చూడాల్సి వస్తోంది. ఈ క్రమంలో మత్స్యకారులకు అవసరమైనంత మత్స్య సంపద అందుబాటులో లేకుండా పోతోంది. దీంతో పాటు మత్స్య సంపద ఎక్కువగా ఉన్నచోట అక్రమ వేటలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో మత్స్యకారుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనే పరిస్థితులు కూడా లేకపోలేదు.

నిషేధిత వలలతో చేపల వేట

మత్స్యశాఖ జలాశయాల్లో ఉన్న మత్స్య సంపదను అభివృద్ధి చేసేందుకు కొన్ని రకమైన వలలను నిషేధించింది. ఇందులో ప్రధానంగా అలవి వలలపై పూర్తి స్థాయిలో నిషేధం విధించింది. ఈ వలలకు పెద్ద చేపలే కాకుండా చిన్న చిన్న చేపపిల్లలు సైతం చిక్కుకునే పరిస్థితి ఉంది. దీంతో మత్స్య సంపద అభివృద్ధి జరగకుండానే పిల్ల స్థాయిలోనే వేటగాళ్లకు చిక్కుతోంది. సరిపడా సిబ్బంది లేకపోవడంతో అలవి వలలతో చేపల వేటకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు.

మత్స్య క్షేత్రాల్లోనూ ఖాళీలు

ఇదిలా ఉంటే మత్స్య క్షేత్రాల్లో ఫిషర్‌మేన్, ఫీల్డ్‌మ్యాన్ ఖాళీలు కూడా అలాగే ఉన్నాయి. జిల్లాలో ఇప్పటివరకు ఉన్న మత్స్య క్షేత్రాలను అభివృద్ధి పరచాల్సిన ప్రభుత్వం ఆ ఊసే ఎత్తడంలేదు. మైలవరం జలాశయానికి సమీపంలో ఉన్న మత్స్యక్షేత్రం పూర్తి స్థాయిలో శిథిలావస్థకు చేరింది. దీంతో అక్కడ క్షేత్రాన్ని మూసివేశారు. ప్రస్తుతం బ్రహ్మంగారి మఠం, కడపలలోని క్షేత్రాలు మాత్రమే పనిచేస్తున్నాయి. వీటిని వదిలేసి ఫిష్ ఆంధ్ర పేరుతో జిల్లాలో 24 చోట్ల చేపల వ్యాపారాన్ని ప్రోత్సహిస్తూ వాటి విక్రయ బాధ్యతలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు.

మత్స్యకారులకు అందని పథకాలు

జిల్లాలోని మత్స్యకారులకు ఐదు నెలలుగా ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందడంలేదని అంటున్నారు. మత్స్యకారుల అభివృద్ధి కోసం గతంలో మత్స్య సహకార సంఘాలను ఏర్పాటు చేసి అందులోని సభ్యులకు చేపల వేటకు సంబంధించిన మెళకువలు నేర్పించడంతో పాటు విక్రయాలు, మార్కెటింగ్‌కు సంబంధించి అనేక పథకాలను ప్రభుత్వం అమలు చేసేది. సిబ్బంది కొరత కారణంగా మత్స్య సహకార సంఘాలకు ఎటువంటి న్యాయం జరగడంలేదని పలు సంఘాల ప్రతినిధులు వాపోతున్నారు. దీంతో మత్స్య సహకార సంఘాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. ఇదిలా ఉండగా జిల్లాలోని పలు జలాశయాల్లో మత్స్య సంపదను అభివృద్ధి చేసేందుకు కొన్ని నెలల క్రితం ప్రభుత్వం చేప పిల్లలను జలాశయాల్లో వదిలేందుకు టెండర్లను ఆహ్వానించింది. టెండర్లు పూర్తయినప్పటికీ సప్లై ఆర్డరు ఇవ్వకపోవడంతో జిల్లాకు ఇతర ప్రాంతాల నుంచి రావలసిన చేప పిల్లలు రాకుండా ఆగిపోయాయి.

ఈ విషయమై మత్స్యశాఖ డీడీ శాంతిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా, సోమశిల వెనుక జలాల పరిధిలో లైసెన్సుదారులను మాత్రమే వేటకు అనుమతించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటి వరకు వెయ్యిమంది మత్స్యకారులకు లైసెన్సులు ఇవ్వాల్సి ఉండగా 335 మందికి మాత్రమే ఇచ్చామని, త్వరలో మిగిలిన వారికి కూడా ఇస్తామన్నారు. నిషేధిత వలల విషయమై ఆమె స్పందిస్తూ అలాంటి వాటిపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. జిల్లాకు అందవలసిన చేప పిల్లలకు సంబంధించి డీడీ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలోని జలాశయాల్లో తక్కువ స్థాయి నీటి మట్టం ఉండడం వల్ల చేప పిల్లలను వదలలేక పోతున్నామన్నారు. జూన్, జూలై నెలల్లో వచ్చే వర్షాకాలంలో నీటి లభ్యతను బట్టి జలాశయాల్లోకి చేప పిల్లలను అక్టోబరు, నవంబరు మాసాల మధ్య వదిలేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

నల్లగంగమ్మ ఆలయంలో పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

సంబేపల్లె, ఫిబ్రవరి4: సంబేపల్లె దేరరాయి నల్లగంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ నిర్మాత, ధర్మకర్తల మండలి చైర్మన్ మునగా మురళిస్వామి, ఈవో కొండారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా యర్రగుంట్లకు చెందిన స్వీట్ స్టాల్ యజమాని హరిబాబు 11 సీలింగ్ ఫ్యాన్లను ఆలయానికి అందజేశారు.

లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కల్యాణం

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 4 : పట్టణంలోని రామ్ నగర్‌లోని లక్ష్మీ వెంకటేశ్వరాలయం మూడవ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం రాజంపేట టీడీపీ నాయకులు పోలి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదానం చేశారు. గ్రామోత్సవం నిర్వహించారు.

శాకంబరిగా గంగమ్మ



లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 4: మండలంలోని అనంత పురం గ్రామంలో ఆది వారం గంగమ్మకు పూజలు నిర్వహిం చారు. జాతర సమీపిస్తుండడంతో అమ్మవారిని ఆదివారం కూరగాయల తో అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు

'సమాచార హక్కు' సమన్వయ కమిటీ అధ్యక్షుడిగా కటికం



రైల్వేకోడూరు, ఫిబ్రవరి 4: సమాచార హక్కు చట్టం న్యాయ పోరాట సమన్వయ కమిటీ రాయలసీమ జోన్ అధ్యక్షుడుగా కటికం సుబ్రహ్మణ్యం ఆదివారం నియమి తులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సమాజంలో ఎవరైనా సమాచారాన్ని తీసుకునే హక్కు ఉంటుందన్నారు. సమాచారం ఇవ్వకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. సమాచారం ఇవ్వం అనడానికి వీలు లేదన్నారు. తనకు ఈ పదవి ఇచ్చిన జాతీయ చైర్మన్ కంచర్ల సురేష్, జాతీయ అధ్యక్షుడు బాలాజీశంకర్‌సింగ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి సురేష్, రాష్ట్ర అధ్యక్షుడు మునిగేటి కాశీకి అభినందనలు తెలిపారు.

వ్యవసాయ రుణాల మాఫీపై అసెంబ్లీలో ప్రకటన చేయాలి

● ఏపీ రైతు సంఘంనే త వంగిమళ్ల రంగారెడ్డి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి4: రాష్ట్రంలోని ప్రతి రైతు కుటుంబంపై రూ.2.45 లక్షల అప్పు ఉందని, ఈ నేపథ్యంలో పంట రుణాల మాఫీపై అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం ప్రకటన చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కరువు, తుఫానులతో నష్టపోయిన రైతాంగానికి పంట నష్టపరిహారంతో పాటు, పంటల బీమా పథకం సత్వరం వర్తించేలా ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. ఎకరాకు రూ.15 వేలు వంతున పెట్టుబడి సాయం ఇవ్వాలన్నారు. రైతుల ఆత్మహత్యల్లో మన రాష్ట్రం 3వ స్థానంలో ఉందన్నారు. ఈ నేపథ్యంలో రుణాల రద్దుకై అసెంబ్లీ సమావేశాల్లో స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 8న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు ఫిబ్రవరి 16న జరిగే గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. గ్రామీణ బంద్ జయప్రదానికి ఇప్పటికే అనేక రూపాల్లో సన్నాహాలు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. గ్రామీణ బంద్‌ను పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేసేందుకు వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు, ప్రజలందరూ సహకరించాలని కోరారు.


సిద్దవటం: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జడ్పీ ఉన్నత పాఠశాల 1994-95 బ్యాచ్ విద్యార్థులు

డీఎస్సీ పేరుతో జగన్‌రెడ్డి కొత్త డ్రామా..

● టీడీపీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథనాయుడు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కస్తూరి విశ్వనాథనాయుడు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 4: గడిచిన నాలుగున్నరేళ్లలో ఎప్పుడైనా జాబ్ క్యాలెండర్ ప్రకటించారా అని రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ కస్తూరి విశ్వనాథనాయుడు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని డీఎస్సీ పేరుతో సీఎం కొత్త డ్రామా ఆడుతున్నారన్నారు. మెగా డీఎస్సీ అని వైసీపీ నాయకులు చెప్పుకుంటున్నారని, కాని అది దగా డీఎస్సీ అని ఆరోపించారు. నిరుద్యోగుల్ని మరోసారి వంచించడానికి సిద్ధం చేశారన్నారు. రాష్ట్రంలో 50,892 పోస్టులు ఖాళీ ఉండగా, కేవలం 6100 ఉద్యోగాలకు మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. రాష్ట్రంలో 50,892 ఉపాధ్యాయ పోస్టులు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు. రాష్ట్రం లో 24 శాతం నిరుద్యోగ సమస్య ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1745 మంది యువకులు బలవన్మరణాలకు పాల్పడారన్నారు. సీఎం జగన్ సభ కోసం విద్యార్థుల పరీక్ష వాయిదా వేయడం పిచ్చి పరాకాష్టకు చేరిందనడానికి నిదర్శనమన్నారు. . నిరుద్యోగులు, యువత ఓటుతో బుద్ధి చెప్పి వైసీపీని గద్దె దింపాలన్నారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు కొమ్మా శివ, మాజీ మండల అధ్యక్షుడు పందేటి వెంకటరామరాజు, ప్రముఖ న్యాయవాది కేజేపీ రెడ్డయ్యనాయుడు, పార్లమెంట్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు తేనేపల్లి చిన్నా, మాజీ సర్పంచులు గడికోట సుబ్బరాయుడు, ముక్కర శంకరయ్య, సీనియర్ నాయకుడు మిట్టవీధి మధు తదితర నాయకులు పాల్గొన్నారు.

జనసేన బలోపేతానికి కృషి చేయాలి


జనసేన నాయకులకు స్వాగతం పలికిన ప్రజలు

ఒంటిమిట్ట, ఫిబ్రవరి 4 : జనసేన పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి దినేష్ పిలుపునిచ్చారు. మండలంలోని కోనరాచపల్లెకు చెందిన చిన్న సుబ్బయ్య, కదిరయ్య, గురవయ్య ఆధ్వర్యంలో పలువురు ఆదివారం జనసేన పార్టీలో చేరారు. పార్టీ కండువా కప్పి ఆయన వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం గ్రామంలో జనసేన పార్టీ చేపట్టే ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ఆయన వివరించారు. రాబోయే ఎన్నికల్లో జనసేన, టీడీపీ కూటమి అభ్యర్థిని బలపరచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ పతనం తథ్యమన్నారు. బడు గు, బలహీన వర్గాలకు వైసీపీ చేసింది శూన్య మని ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించి వారికి తీవ్ర అన్యాయం చేశారన్నారు. మా ఎస్సీలు, మా ఎస్టీలు, మా బీసీలు అంటూ బస్సు యాత్రలు చేసిన ఈ వైసీపీ పెద్దలు దళితులపైన పది వేల దాడులు చేసి, అక్రమ కేసులు బనాయించి, పలువురు దళిత సోదరులను హత్యలు చేయించి డోర్ డెలివరీ చేశారన్నారు. అలాంటి అరాచక పాలన చేస్తున్న ఈ ప్రభుత్వాన్ని గద్దె దించే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల వీర మహిళ వరలక్ష్మి, జనసేన నాయకులు కొట్టే శ్రీహరి, పొలిశెట్టి శ్రీనివాసులు, గుగ్గిళ్ల నాగార్జున, ఉపేంద్ర, మస్తాన్‌రాయల్, నేతి వెంకటేష్, రత్నం, గుగ్గిళ్ల వెంకటేష్, సుబ్బయ్య, రమణ, సతీష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం: జనసేన పార్టీ నేత అతికారి కృష్ణ ఆధ్వర్యంలో సిద్దవటం నుంచి కమ్మపాలెం మీదుగా జంగాలపల్లె వరకు నిర్వహించిన ర్యాలీలో జనసేన కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. టీడీపీ, జనసేన పార్టీలను ఆశీర్వదించాలని అతికారి కృష్ణ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజలు ఆకలి మంటలతో అల్లాడుతుంటే సైకో ముఖ్యమంత్రి నిత్యావసరాల ధరలు పెంచి ప్రజలను అర్ధాకలితో మిగిల్చారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలందరూ వచ్చే ఎన్నికల్లో ఓటుతో వైసీపీకి బుద్ధి చెప్తారన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో ఓటరు వెరిఫికేషన్


ఓటరు జాబితా పరిశీలిస్తున్న గన్నె సుబ్బనరసయ్యనాయుడు తదితరులు

రాజంపేట, ఫిబ్రవరి 4: మండలంలోని డీబీఎన్ పల్లె అరుంధతివాడలో ఆదివారం రాత్రి తెలుగుదేశం పార్టీ రాజంపేట మండలటీడీపీ అధ్యక్షుడు గన్నె సుబ్బ నరసయ్య నాయుడు ఆధ్వర్యంలో బూత్ నెంబరు 176 లోని ఓటరు లిస్టును పరిశీలించారు. బూత్ నెంబరు 176లోని సుమారు 300 ఓట్లు బూత్ నెంబరు 175లో ఉన్నాయన్న విషయాన్ని తహసీల్దారు సుబ్ర మణ్యంరెడ్డి, ఆర్డీవో రామకృష్ణారెడ్డికి తెలియజేసినా ఏ మాత్రం పట్టించు కోవడం లేదన్నారు. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు బాపనయ్యనాయుడు, టీడీపీ నేతలు దివాకర్, వెంకటేశ్వర్లు, విశ్వనాథ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్ పునరుద్ధరించే వారికే ఓటు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 4: పాత పించను పద్ధతి పునరుద్ధరణకు హామీ ఇచ్చే వారికే ఉద్యోగ, ఉపాధ్యాయుల ఓటు అని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బీ హరిప్రసాద్, షేక్. జాబీర్ తెలిపారు. ఆదివారం వారు పట్టణంలోని అలీమాబాద్ వీధి ఉర్దూ ఉన్నత పాఠశాల ఆవరణలో ఓట్ ఫర్ ఓపీఎస్ గోడపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవీ విరమణ అనంతరం భద్రత కోసం పోరాడి సాధించుకున్న పెన్షన్‌ను నేటి కార్పొరేట్ అనుకూల ప్రభుత్వాలు రద్దు చేసి సీపీఎస్ అంటూ జీపీఎస్ అంటూ ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే చర్యలను తీవ్రంగా ఖండించారు. ఎవరైతే ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పించన్ అమలు చేస్తామని వారి మేనిఫెస్టోలో ప్రకటించడంతోపాటు ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పాత పెన్షన్ పునరుద్ధరణ ఫైల్‌పై మొదటి సంతకం చేస్తామని హామీ ఇస్తారో వారికే ఉద్యోగ, ఉపాధ్యాయుల ఓటు అనే నినాదాన్ని ఉద్యోగ, ఉపాధ్యాయులతో పాటు ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ప్రసాద్, రాయచోటి మండల అధ్యక్షుడు హఫీజుల్లా, సహాధ్యక్షుడు రఫీ, చిన్నమండెం మండల సహాధ్యక్షుడు కిఫాయతుల్లా, మండల కోశాధికారి ఆదిల్, గాలివీడు మండల నాయకులు రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ కార్యాలయ ప్రారంభోత్సవం

చిట్వేలి, ఫిబ్రవరి 4 : మండల కేంద్రంలోని కొత్త బస్టాండులో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథ నాయుడు టీడీపీ కార్యాలయం ప్రారంభిస్తారని మండల టీడీపీ అధ్యక్షుడు కె.కె.చౌదరి తెలియజేశారు. ఆదివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర యాదవ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్‌రాజు, తానా మాజీ అధ్యక్షుడు వేమన సతీష్ రానున్నారని తెలిపారు. సాయంత్రం 5గంటలకు జయహో బీసీ సమావేశం ఉంటుందన్నారు. మండల ప్రధాన కార్యదర్శి అనంత య్యయాదవ్, రాజంపేట పార్లమెంటు వాణిజ్యవిభాగం కార్యనిర్వహణ కార్యదర్శి బుంగటావుల రాజశేఖర్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు గుం డాలయ్య యాదవ్, మండల సీనియర్ నాయకులు బి.సుబ్బనాగులు, దుగ్గి న వెంకటయ్య, మాచిన సుబ్బరామయ్య, బుర్రు సుబ్రమణ్యం యాదవ్, పార్లమెంటు తెలుగు యువత అధికార ప్రతినిధి బాలకృష్ణ యాదవ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ధనాసి పెంచలయ్య పాల్గొన్నారు.

కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 4: ఫీజుల విషయంలో వేధించి విద్యార్థి తండ్రి మృతికి కారణమైన మదనపల్లె పట్టణంలోని కళాశాల కరస్పాండెంట్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి, గుర్తింపును రద్దు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి వాసుదేవనాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. ఫీజు చెల్లింపునకు రెండు రోజులు గడువు ఇవ్వాలని ఇంటర్ విద్యార్థి సురేష్ తండ్రి కోరినా లెక్కచేయకుండా వేధించడంతో ఆయన గుండెపోటుతో మరణించాడన్నారు. ఇది తెలిసినా జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి కృష్ణయ్య ప్రేక్షక పాత్ర వహించడంతోపాటు యాజమాన్యానికి వత్తాసు పలుకుతున్నాడని ఆరోపించారు. పీడీఎస్‌యూ పట్టణ నాయ కులు కుమార్‌నాయక్, రవీంద్ర, ఈశ్వర్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 4 : జాతీయ హైవే రోడ్డుపై జరిగే ప్రమాదాలను అంచనా వేసేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపకరిస్తాయని ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. స్థానిక రమ్య పెట్రోలు బంక్ యాజమాన్యం సహకారంతో నిఘా కెమెరాలను ఏర్పాటు చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో పెట్రోలు బంక్ యజమాని దగ్గుపాటి నికేతన్ కుమార్, మేనేజర్ ఈశ్వర్, పోలీసు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పని చేయండయ్యా.. కారణాలు చెప్పొద్దు!

● పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించండి

● అధికారులకు కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఆదేశం

నందలూరు, ఫిబ్రవరి 4: పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనపై జిల్లా కలెక్టర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎర్రచెరువుపల్లి పోలింగ్ కేంద్రాన్ని శనివారం కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పరిశీలించారు. మండలంలోని పోలింగ్ కేంద్రాలు, ఓటరు నమోదు తదితర విషయాలను ఎవరు చూస్తున్నారని ప్రశ్నించారు. దీంతో తహసీల్దారు ఏమీ మాట్లాడకపోవడంతో మీకు కమిట్మెంట్ లేదు కదా.. మీకు ముందు ఏం జరిగిందో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది కదా అన్నారు. ఎన్నికలను ఇంత నిర్లక్ష్యంగా తీసుకోవడం ఎలా అని తహసీల్దారుపై మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు వారి కార్యాలయాలలో కూర్చోకుండా పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో ఆర్డీవో మోహన్‌రావు, రాజంపేట తహసీల్దారు సుబ్రమణ్యంరెడ్డి, డీటీలు మోహనకృష్ణ, సాయబ్ బాషా, ఆర్ఐ సుశీల్, వీఆర్వో గంగాధరం ఇతర అధికారులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

టీచర్ కావాలి.. సార్!

● కలెక్టర్‌ను కోరిన విద్యార్థులు



కలెక్టర్‌కు సమస్యను తెలుపుతున్న విద్యార్థులు

నందలూరు, ఫిబ్రవరి 4: టీచర్‌ను నియమించండి సార్ అంటూ మండలంలోని ఎర్రచెరువుపల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులు కలెక్టర్ అభిషిక్త్ కిషోర్‌ను కోరారు. శనివారం ఆయన పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా నాలుగో తరగతి విద్యార్థులు గాయత్రి, అనిత మాట్లాడుతూ పాఠశాలలో 32 మంది విద్యార్థులుండగా ఒకే ఒక టీచర్ ఉండటంతో తాము ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. సానుకూలంగా సమస్యను విని స్పందించిన కలెక్టర్ వారి సమస్యను పరిశీలించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు .అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను కలెక్టర్ పరిశీలించారు.

23 మందికి కంటి ఆపరేషన్లు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 4: మండల పరిధిలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, అర్హులైన 23 మందికి కంటి ఆపరేషన్లు చేశారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 35 మందికి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వైవీ స్వరూపగుప్త, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లయన్ చెన్నూరు అన్వర్‌బాషా, కంటి వైద్యులు సురేశ్‌బాబు, భార్గవి, ఆఫ్తాల్మిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్లకు బకాయిలు చెల్లించాలి: ఏఐటీయూసీ


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 4: ఆశ వర్కర్స్‌కు సంబంధించిన బకాయిలు చెల్లించాలని ఏఐటీ యూసీ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ఇన్‌చార్జ్ గుంటి వేణుగోపాల్, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎం. గంగాధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ఆశ కార్యకర్తలకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, మెడికల్ ఉద్యోగులుగా గుర్తించాలని, సాధారణ, మెటర్నిటీ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీబీ, లెప్రసీ, ట్యూబెక్టమీ, కరోనా తదితర అలవెన్సుల బకాయిలు తక్షణం చెల్లిం చాలని తెలిపారు. 2019లో రూ. 10 వేలు వేతనం ఇస్తున్నట్లు ప్రకటించారన్నారు. అన్ని అలవెన్సులతో కలిపి రూ. 10 వేలు లోపే ఇస్తున్నట్లు అధికారులు చెబుతు న్నారన్నారు. గత ప్రభుత్వం రూ. 3000 వేతనం తో పాటు రూ. 5600 లు అలవెన్సు ఇచ్చేదని గుర్తు చేశారు. అధికారుల వత్తిడితో దీర్ఘకాలిక రోగాలకు గురై ఆశ కార్యకర్త లు మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రిటైర్మెంట్ వయస్సు 62కు పెంచాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఏదైనా కారణాలతో ఆశ కార్యకర్తలు చనిపోతే రూ. 10 లక్షల ప్రమాద బీమా ఇవ్వాలని తెలిపారు. మలేరియా అధికారులు గతంలో పంపిణీ చేసిన దోమతెరల మొత్తాన్ని ఇంకా ఇవ్వలేదన్నారు. నాలుగున్నరేళ్లుగా ఇవ్వవలసిన అలవెన్సు మొత్తాలను వెంటనే చెల్లించక పోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ కన్వీనర్ సరోజనమ్మ, ఆశ సంఘం నాయకురాళ్లు రత్నమ్మ, భాగ్యమ్మ, సుబ్బమ్మ, కుమారీ, చెంగమ్మ, ప్రసన్న, విజయ, శోభా పాల్గొన్నారు.

చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యం


జెట్టివారిపల్లె అరుంధతివాడలో ప్రచారం చేస్తున్న నగిరిపాటి రేవతి

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 4: నారా చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని టీ డీపీ నియోజకవర్గ నాయకురా లు నగిరిపాటి రేవతి తెలిపారు. ఆదివారం రైల్వేకోడూరు నియో జకవర్గంలోని గాదెల, సిద్ధారెడ్డి పల్లె, నాగవరం, జెట్టివారిపల్లె అరుంధతివాడల్లో ముమ్మరంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ పాలనపై ప్రజలు విసుగు చెందారన్నారు. చంద్రబాబు విజన్ కల్గిన నాయకుడు అని తెలిపారు. విజన్ లేని నాయకుడు జగన్ అని అన్నారు. టీడీపీ హయాంలో చంద్రబాబు పరిశ్రమ లు తెచ్చి అనేది మందికి ఉపాధి కల్పించారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఉన్న పరిశ్రమలు వేరొక ప్రాంతాలకు తరలిపోయాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ తహసీల్దార్ నగిరిపాటి సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు హరి, దళిత నాయకులు తేనేపల్లి చిన్నా, గడ్డం శ్రీరాములు, నగిరిపాటి రాయుడు తదితరులు పాల్గొన్నారు.

డబ్బుతో ఓటర్లను కొనేందుకు వైసీపీ సిద్ధం


ప్రచారం చేస్తున్న జనసేన నేత శ్రీనివాసరాజు

సుండుపల్లె, ఫిబ్రవరి4: ఓటర్లను డబ్బుతో కొనేందుకు వైసీపీ సిద్ధమైందని, రాష్ట్ర అభివృద్ధి కోసం టీడీపీ, జనసేన కూటమికి ఓటు వేసి గెలిపించాలని నియోజకవర్గ జనసేన నేత ఎల్లటూరి శ్రీనివాసరాజు కోరారు. ఆదివారం ముడుంపాడు గ్రామ పంచాయతీ పింఛాలో ఆయన పర్యటించారు. ప్రజలకు మంచి చెప్పి వారిని గెలిపిస్తే గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అభివృద్ధి సాధ్యపడుతుందన్నా రు. అధికార పార్టీ నోట్ల కట్టలతో చేసే రాజకీయాలను ప్రజలు తిప్పి కొట్టాలని కోరారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అరాచకాలు అక్రమాలకు తెరలేపారని విమ ర్శించారు. అరాచక పాలన పోవాలి ప్రజాపాలన రాష్ట్రంలో అధికారంలోకి రావాలని అది టీడీపీ జనసేనతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివ ప్రసాద్, జనసేన నాయకులు రాజా, రమేశ్, షరీఫ్, శ్రీను, మనోహర పాల్గొన్నారు.

సమాజ్‌వాది పార్టీ బైక్ ర్యాలీ


సమాజ్‌వాది పార్టీ నేత పాండురంగకు స్వాగతం పలుకుతున్న మహిళలు

సిద్దవటం, ఫిబ్రవరి 4: సమాజ్‌వాది పార్టీ రాయలసీమ జిల్లా కో-ఆర్డినేటర్ పాండు రంగ ఆధ్వర్యంలో సిద్దవటం మండలం కనుమలోపల్లె వద్ద ఆదివారం కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు సామాజిక వర్గాల ఆధిపత్య పోరులో పేద బలహీన వర్గాలకు చెందిన వారు ఎంతో ఇబ్బందిపడుతున్నారన్నారు. దేశంలో ఎన్నో రాజకీయ పార్టీలున్నా, ప్రజలందరూ ఎస్సీ ఎస్టీ పేదల బలహీన వర్గాలకు చెందిన సమాజ్‌వాది పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. రాబోయే రోజుల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి మండలం తిరిగి పార్టీకి పూర్వ వైభవం వచ్చే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్యకర్తలకు తెలియజేశారు.

తహసీల్దార్‌కు సత్కారం


తహసీల్దార్ రామమోహన్‌ను సత్కరించిన అధికారులు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 4: మండల తహసీల్దార్‌గా పని చేసిన బి. రామమోహన్ ఎన్నికల సందర్భంగా తిరుపతికి బదిలీ అయ్యారు. దీంతో ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ అమరేశ్వరి ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సిద్దు, ఆర్ఐ రాజశేఖర్, సర్వేయర్ సుదర్శన్, రీ-సర్వే డీటీ మానస, ఎన్‌ఫోర్సుమెంట్ డీటీ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున రెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ సాయిరాఘవేంద్రారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు: సాధారణ బదిలీల్లో భాగంగా పెనగలూరు నుంచి తిరుపతి జిల్లాకు బదిలీ అయిన తహశీల్దారు శ్రీధర్‌రావుకు ఆదివారం రెవెన్యూ కార్యాలయంలో సిబ్బంది ఘనంగా సన్మానించారు. డిప్యూటీ తహసీల్దారు మురళీకృష్ణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, జూనియర్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్యలతో పాటు వీఆర్వోలు, వీఆర్యేలు పాల్గొన్నారు. మాజీ డీసీసీబీ డైరెక్టర్ లేబాక శ్రీనివాసులురెడ్డి, మండల వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ లేబాక శ్రీనివాసులురెడ్డి, వైసీపీ మండల ఇన్‌చార్జి కేతా చక్రపాణి, జెడ్పీటీసీ యు.పి.సుబ్బరాయుడు, నల్లపురెడ్డిపల్లె మాజీ సర్పంచ్ సానారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయురాలికి సన్మానం


వ్యాయామ ఉపాధ్యారాలు లక్ష్మీదేవిని సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 4: చిన్న ఓరంపాడు జిల్లా పరిషత్ హై స్కూలు వ్యాయామ ఉపాధ్యాయురాలు లక్ష్మీదేవి పదవీ విరమణ సందర్భంగా హెడ్ మాస్టర్ టి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆదివారం సన్మానం చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆమె సేవలను కొనియాడారు. అనంతరం ఆమె విద్యార్థులకు అట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం శ్రీకాంత్‌బాబు, నారాయణ, సుధాకర్, శివప్రసాద్, పెంచలయ్య, సుజాత, ప్రదీప్, విజయ, విద్యార్థులు పాల్గొన్నారు.

250 మందికి ఉచిత వైద్య సేవలు

సుండుపల్లె, ఫిబ్రవరి 4: మండల కేంద్రం లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జేపీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో 250 మందికి ఉచిత వైద్య సేవలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్ పరీక్షలతో పాటు డాక్టర్లు జయప్రకాశ్‌రెడ్డి, అబ్దుల్ ఘని పలు వ్యాధులకు చికిత్స చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ ప్రశాంత్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లోపాయికారీగా కాంట్రాక్ట్ ఉద్యోగుల కొనసాగింపు

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 4 : కాంట్రాక్ట్ గడువు ముగిసినా ము గ్గురు ఉద్యోగుల కొనసాగిస్తున్న అంశం మంగంపేట ఏపీఎండీసీ లో చర్చకు దారి తీస్తోంది. సంస్థ లో ఒక సంవత్సర కాలానికి కాం ట్రాక్ట్ ఉద్యోగులను తీసుకుని, బ యోమెట్రిక్ ద్వారా వారికి వేతనాలు చెల్లిస్తారు. గడువు ముగిసిన అనంతరం వారిని కొనసాగించాలంటే నూతన ఒప్పందం చేసుకోవాల్సి ఉండగా, వేబ్రిడ్జిలో ఒకరు, రాయల్టీ విభాగంలో ఒకరు, నర్సరీలో మరొకరిని అలాంటిదేమీ లేకుండానే కొనసాగించడంపై కార్మికులు గుసగుసలాడుతున్నారు. ఈ విషయంపై వివరణ కోరేందుకు చరవాణిలో సంప్రదించగా సీపీవో సుదర్శన్‌రెడ్డి స్పందించలేదు.

పల్లెపల్లెకు బీజేపీ.. గడపగడపకు కమలం


ప్రసంగిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు

రాజంపేట, ఫిబ్రవరి 4 : ఎన్నికల సందర్భంగా పల్లెపల్లెకు బీజేపీ.. గడప గడపకు కమలం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు తెలిపారు. ఆదివారం రాజంపేట బీజేపీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త ముందుకు సాగాలన్నారు. ప్రతి బీజేపీ కార్యకర్త వారికి కేటాయించిన గ్రామాల్లో పర్యటించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. రాబోయే ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోదీని మూడవ సారి గెలిపించి దేశాన్ని ముందుకు నడిపించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామం , రాష్ట్రం, దేశం అభివృద్ధి చేయాలన్నా నరేంద్రమోదీ ప్రభుత్వమే శరణ్యన్నారు. రాష్ట్రంలో అవినీతి అసమర్థ వైసీపీ పాలనను కూల్చడానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆదినారాయణ, రమణ, నగేష్, సూర్యచంద్ర తదితరులు పాల్గొన్నారు.



పాతగుంట జల్లికట్టు అల్లిలో జనం - గిత్తను పట్టుకుంటున్న యువకులు

రంకేసిన గిత్తలు

పాతగుంట, సింగపూరిండ్లలో జల్లికట్టు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 4: వెదురుకుప్పం మండలం పాతగుంట, సింగపూరిండ్ల(ఎం.వేణుగోపాలపురం)లో ఆదివారం జల్లికట్టు నిర్వహించారు. అధిక సంఖ్యలో జనం తరలి రావడంతో ఆయా గ్రామాలు జనసంద్రంగా మారాయి. పలు ప్రాంతాల నుంచి పశువులను తీసుకొచ్చిన యజమానులు.. వాటి కొమ్ములకు బహుమతులుగా పట్టీలను కట్టి అల్లిలోకి వదిలారు. వీటిని పట్టుకునే క్రమంలో యువకులు కింద పడ్డారు. కొందరు గాయపడ్డారు. కొందరు గిత్తలను పట్టుకుని పట్టీలను సొంతం చేసుకున్నారు.

రాళ్లబూదుగూరులో ఎద్దుల పండగ

శాంతిపురం: శాంతిపురం మండలం రాళ్లబూదుగూరులో ఆదివారం పశువుల పండగ జరిగింది. ఎద్దులకు కవల్లు కట్టి బారికేడ్ల మధ్య ప్రధాన వీధుల్లో పరిగెత్తించారు. ఎద్దులకు కట్టిన టవళ్లను విప్పుకొనేందుకు యువకులు పోటీపడ్డారు. అటు తమిళనాడు, ఇటు కర్ణాటక రాష్ట్రాల నుంచీ రైతులు తమ పశువులను తీసుకొచ్చారు. ఇక, ఎద్దుల పండుగను తిలకించడానికి భారీగా తరలివచ్చిన వారితో గ్రామం జనసంద్రంగా మారింది.



కాణిపాకంలో భక్తుల రద్దీ



ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 4: కాణిపాకం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడంతో ఉదయం నుంచి స్వామి దర్శనానికి రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు కాణిపాకానికి విచ్చేయడంతో ఆలయం పూర్తిగా నిండి పోయింది. దీంతో స్వామి దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పట్టింది. క్యూలైన్లలో భక్తులు ఇబ్బందులు పడకుండా ఆలయ అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు.

కాంగ్రెస్ పార్టీ మీడియా అధికార ప్రతినిధిగా గోవర్ధన్ రెడ్డి



కార్వేటినగరం,ఫిబ్రవరి4:కార్వేటినగరం మండలం ఆర్‌కేవీబీ పేటకు చెందిన ఎం.గోవర్ధన్‌రెడ్డిని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మీడియా అధికార ప్రతినిధిగా నియమించారు. కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్ తులసి రెడ్డి తనను ఈ పదవికి ఎంపిక చేసినట్లు ఆయన ఆదివారం చెప్పారు.

మినీ లారీ, లగేజీ వ్యాన్ ఢీ

● ముగ్గురికి తీవ్ర గాయాలు





ప్రమాదానికి గురైన వాహనాలు - స్టీరింగ్‌కు ఇరుక్కున్న క్షతగాత్రుడు - చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

చిత్తూరు, ఫిబ్రవరి 4: మినీ లారీ, లగేజీ వ్యాన్ ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదం చిత్తూరు నగరం పలమనేరు రోడ్డులో ఆదివారం వేకువజామున చోటుచేసుకుంది. ట్రాఫిక్ ఎస్ఐ బాబు తెలిపిన ప్రకారం.. పలమనేరు, గంగవరం మండలాలకు చెందిన అహ్మద్ బాషా, రషీద్ అహ్మద్, అస్లాం బాషా లగేజీ వ్యాన్‌లో పలమనేరు నుంచి చిత్తూరుకు బయలుదేరింది. తమిళనాడుకు చెందిన మినీలారీ పలమనేరుకు వెళ్లే క్రమంలో పలమనేరురోడ్డులోని చర్చి వద్ద ఈ రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో అహ్మద్ బాషా, రషీద్ అహ్మద్, అస్లాం బాషాకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

నిమ్మనపల్లె వైపు మళ్లిన జంట ఏనుగులు

సోమల, ఫిబ్రవరి 4: సోమల మండలంలో రైతుల కంట కన్నీరు తెప్పించిన జంట ఏనుగులు ఆదివారం నిమ్మనపల్లె మండలం బాలేపల్లెవైపు వెళ్లినట్లు సర్పంచు సురేంద్రరెడ్డి తెలిపారు. మూడు రోజులుగా ఇరికిపెంట, మేటిమంద, నడింపల్లె, తమ్మినాయనపల్లె, పేగలవారిపల్లె గ్రామాలకు చెందిన రైతుల పొలాల్లో పలు పంటలను ధ్వంసం చేశాయి. ఈక్రమంలోనే సురేంద్రరెడ్డి చొరవ తీసుకుని రైతులు వెంట రాగా అటవీ క్షేత్ర సిబ్బందితో కలసి టపాసులు పేల్చుతూ, డప్పులు వాయిస్తూ ఏనుగుల వెంట పరుగులు తీశారు. ఎట్టకేలకు అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె వైపు దారి మళ్లించారు.

ఆన్‌లైన్ గేమ్‌లో ఘర్షణ

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 4: సెల్‌ఫోన్‌ల్లో ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ రెండు వర్గాల యువకులు ఘర్షణ పడి గాయపడడంతో ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ గౌరీశంకర్ తెలిపారు. మంగళం పంచాయతీ బాగేపల్లెకు చెందిన చిరంజీవి, రవికుమార్, ప్రసాద్, కల్యాణ్, రాజేశ్, భరత్ ఒక వైపు.. మరో పక్క రమణ, విశాక్, కార్తీక్, అశోక్, నాగ, అనిల్ కలసి సెల్ ఫోన్లలో ఆన్‌లైన్ గేమ్ ఆడుతూ ఘర్షణ పడినట్లు తెలిపారు. చిరంజీవి వర్గీయులపై రమణ వర్గీయులు దాడి చేయగా చిరంజీవి గాయపడి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నత్తంకండ్రిగలో వ్యక్తి హత్య

● కత్తితో దాడి చేసిన దుండగుడు.. ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి



జగదీష్ నాయుడు మృతదేహం

నగరి, ఫిబ్రవరి 4: నగరి మండలం నత్తం కండ్రిగకు చెందిన జగదీష్ నాయుడు(34) శనివారం రాత్రి హత్యకు గురయ్యారు. సీఐ సురేష్ నాయుడు తెలిపిన ప్రకారం.. శనివారం రాత్రి తన ఇంటి వద్ద ఉన్న జగదీష్‌పై గుర్తు తెలియని వ్యక్తి కత్తితో దాడి చేశాడు. గాయపడిన ఆయన్ను స్థానికుల సాయంతో కుటుంబీకులు ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. అనంతరం మృతదేహాన్ని నగరి ఏరియా వైద్యశాలకు తీసుకొచ్చారు. ఆదివారం పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఈ మేరకు నగరి సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎస్టీ కాలనీలోని ఓ మహిళతో ఉన్న వివాహేతర సంబంధమే ఈ హత్యకు దారి తీసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఆ మహిళ విడాకులకు కోర్టుకు వెళ్లారని అంటున్నారు. ఎలాగైనా చంపేస్తానని ఆ మహిళ భర్త పలు సార్లు బెదిరించడంతో జగదీష్ తన ఇంటి వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నట్లు అతడి బంధువులు చెప్పారు. ఈ క్రమంలో ఆ మహిళ భర్తే ఈ దారుణానికి పాల్పడి ఉంటాడని అనుమానిస్తున్నారు.

రోజా అనుచరుడిపై దాడి ఘటనలో ముగ్గురి అరెస్టు

నగరి, ఫిబ్రవరి 4: మంత్రి ఆర్కే రోజా ప్రధాన అనుచరుడు ప్రత్యూష్‌పై తిరుత్తణిలో జరిగిన దాడికి సంబంధించి టీడీపీకి చెందిన నవీన్, చిరంజీవి, మధుఅలియాస్ పరశురామ్‌ను అక్కడి పోలీసులు శనివారం రాత్రి అరెస్టు చేశారు. పరారీలో ఉన్న చిట్టిబాబు కోసం గాలిస్తున్నారు.





క్యూలైన్లలో వేచియున్న భక్తులు - వాహనాలతో స్తంభించిన ట్రాఫిక్

బోయకొండ కిటకిట



ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, ఫిబ్రవరి 4: బోయకొండ ఆదివారం గంగమ్మ నామస్మరణతో మార్మోగింది. ఉదయం వేదపండితులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేసి, స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో క్యూలైన్లు కిక్కిరిసాయి. సాయంత్రం 4 గంటల వరకు రద్దీ కొనసాగింది. సుమారు 40వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అధిక సంఖ్యలో వాహనాలు కొండకు రావడంతో కొండపైకి వెళ్లే ఘాట్ రోడ్డులో ఉన్న రణభేరి గంగమ్మ ఆలయం నుంచి కొండపై ఉన్న కార్యాలయం వరకు ట్రాఫిక్ స్తంభించింది. భక్తుల ఏర్పాట్లను ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళి పర్యవేక్షించారు.

విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఆపాలి : టీఎన్‌టీయూసీ

కుప్పంలో ముగిసిన చంద్రన్న కార్మిక చైతన్య బస్సు యాత్ర



టీఎన్‌టీయూసీ టీంను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

కుప్పం, ఫిబ్రవరి 4: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను వీడి విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేసి ఆర్థిక వెసులుబాటు కల్పించాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టిముక్కల రఘురామరాజు అన్నారు. జనవరి 6న ప్రారంభమైన చంద్రన్న కార్మిక చైతన్య బస్సు యాత్రను కుప్పంలో ముగించారు. ఆదివారం కుప్పం చేరుకున్న యాత్రకు స్థానిక టీడీపీ నేతలు స్వాగతం పలికారు. బస్సు యాత్ర బృందంతో కలసి కుప్పం పట్టణంలో పర్యటించారు. కుప్పం పూలమండీలలో కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆపై కుప్పం టీడీపీ కార్యాలయంలో బందాన్ని సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో కార్మికులందరూ కడుపునిండుగా అన్నం తినేవాళ్లన్నారు. అదే నేడు కార్మిక లోకం భవిష్యత్తు ఆగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత టీడీపీ పాలనలో ఎన్నో పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తెచ్చి చేతినిండా పనులు కల్పించారన్నారు. నాడు కార్మికులకు స్వర్ణ యుగం నడిస్తే, నేడు వైసీపీ పాలనలో రాతి యుగం నడుస్తోందన్నారు. తిరిగి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కుప్పంలో 33 ఎకరాల్లో ఆటోనగర్ ఏర్పాటు చేసి కార్మికులను ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ నేతలు ఫణేశ్వర్‌రావు, పరుచూరి ప్రసాద్, మల్లికార్జునరావు, శివాజీ, హమాలీ సంఘ నాయకులు లింగంపల్లె మోహన్‌రావు, సూర్య, మాధవనాయుడు, రాజ్‌కుమార్, టీడీపీ నేతలు పీఎస్.మునిరత్నం, సత్యేంద్రశేఖర్, గోపినాథ్, వెంకటేష్, సుగుణాకర్, శ్రీకాంత్ జనసేన నేతలు నవీన్, రజేష్ తదితరులు ఉన్నారు.

కె.సభా సంకలనాలను అందిస్తే పుస్తకాలుగా ప్రచురిస్తాం

కె.సభా శత జయంత్యుత్సవాల్లో కేంద్ర సాహిత్య అకాడమీ కన్వీనర్ మృణాళిని



రచయిత్రి మృణాళినిని సత్కరిస్తున్న జిల్లా రచయితల సంఘం, నిర్వాహకులు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 4: నాటి సంస్కృతి, సాంఘికత్వం, జీవన విధానానికి తన రచనల్లో కె.సభా రూపురేఖలు కల్పించి జిల్లా ఖ్యాతిని చాటారని కేంద్ర సాహిత్య అకాడమీ కన్వీనర్ మృణాళిని పేర్కొన్నారు. ప్రముఖ రచయిత, సంపాదకుడు, ప్రచురణ కర్త కె.సభా శత జయంత్యుత్సవాలను నిర్వహించడం కేంద్ర సాహిత్య అకాడమీకి మణిహారం లాంటిదన్నారు. చిత్తూరులోని కట్టమంచి బాలకృష్ణారెడ్డి మ్యాంగో భవన్‌లో ఆదివారం కేంద్ర సాహిత్య అకాడమీ, జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కె.సభా శత జయంత్యుత్సవాల్లో ఆమె మాట్లాడారు. ఆయన సాహిత్య సంకలనాలను సేకరించి అకాడమీకి అందజేస్తే, వాటిని పుస్తకాలుగా ప్రచురిస్తామని చెప్పారు. సభా రచనల పట్ల పరిశోధనలు చేసే వారికి అకాడమీ ఆర్థిక సహకారం అందిస్తుందని ఆమె తెలిపారు. రాయలసీమ తొలి కథా రచయితగా పేరు పొందిన కె.సభా.. సామాజిక, ఆర్థిక, సాంఘిక అంశాలను తనదైన రీతిలో, తగు మాండలీకాల్లో రచించి వన్నె తెచ్చారని ప్రముఖ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత మధురాంతకం నరేంద్ర అన్నారు. ఆయన 290కి పైగా కథలు రాస్తే కేవలం 40 మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు. సభా పుట్టిన రోజే ఆయన కుమారుడు రమణ వర్థంతి రోజు కూడా కావడం బాధాకరమని కిరణ్ క్రాంత్ చౌదరి పేర్కొన్నారు. నీటి దీపాలు, బంగారమ్మ కథల్లో ఇరుగు పొరుగు సంభాషణలను అతి చక్కగా, సరళమైన భాషలో రచించారని ఎస్వీయూ తెలుగు అధ్యయన శాఖాధిపతి రాజేశ్వరమ్మ వివరించారు. చిన్నారుల మానసిక వికాసానికి, విజ్ఞానికి రచనలు చేసి మెప్పించిన రచయితల్లో మొదటి వారి సభా అని నేషనల్ బుక్ ట్రస్టు సభ్యుడు పత్తిపాటి మోహన్ అన్నారు. పలమనేరు బాలాజి మాట్లాడుతూ.. సభా కవితలు ఎంతో సరళమైన పదాలతో ఉండి అన్నీ వర్గాల వారిని ఆలోచింప చేస్తాయన్నారు. జొన్న విత్తుల శ్రీరామచంద్రమూర్తి, ఎంఆర్ అరుణకుమారి, ఉర్దూ రచయిత కాసీం అలీ ఖాన్, కట్టమంచి బాలకృష్ణారెడ్డి, డాక్టర్ కె.రామలక్ష్మి, కె.వేణుగోపాల్, పసతల హరికృష్ణారెడ్డి, సామాజిక కార్యకర్త అశోక్ కుమార్ తమ ప్రసంగాల్లో సభా సాహితీ సేవలను కొనియాడారు. సభా కుటుంబ సభ్యులను నిర్వాహకులు సన్మానించారు. రచయిత్రి మృణాళిని కూడా సత్కరించారు.

సొసైటీల్లో కమిటీల పాలనే

● మరో ఆరునెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు

● ఐదేళ్లుగా ఎన్నికలకు చొరవ చూపని ప్రభుత్వం

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 4: రైతుల భాగస్వామ్యంతో సహకార సంఘాలు పనిచేయాలి. అయితే వారి భాగస్వామ్యం లేకుండా, సంఘాల్లో వారి పాత్రను దూరం చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటోంది. ఈ క్రమంలో మరో ఆరు నెలలు త్రిసభ్య కమిటీల ఆధ్వర్యంలోనే ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల (సింగిల్ విండోలు) కార్యకలాపాలు జరగనున్నాయి. ఎన్నికలు నిర్వహించకుండా దొడ్డిదారిన కమిటీలతో ప్రభుత్వ పాలన సాగిస్తోంది. ఐదేళ్లుగా సహకార ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం చొరవ చూపడంలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చాక సింగిల్ విండోల్లో త్రిసభ్య కమిటీల పాలనను కొత్తగా ప్రవేశపెట్టింది. ప్రతి ఆరు నెలలకు ఓసారి ఈ కమిటీల పదవీ కాలాన్ని కొనసాగిస్తూ వస్తోంది. తాజాగా ఉమ్మడి జిల్లాలోని 76 సింగిల్ విండోలకు త్రిసభ్య కమిటీల పదవీకాలం జనవరి 31వ తేదీతో ముగిసింది. ఫిబ్రవరి 1 నుంచి జూలై 31 వరకు ఆ కమిటీల పదవీకాలం పొడిగిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. మంత్రి పెద్దిరెడ్డి కనుసన్నల్లోనే త్రిసభ్య కమిటీల సభ్యుల నియామకాలను సహకారశాఖ చేస్తోంది. కాగా, ప్రస్తుతం ఐరాల కమిటీ చైర్మన్‌ను మార్పు చేసింది. రాజకీయాలకు అతీతంగా సింగిల్ విండోలు పనిచేయాల్సివుండగా, మితిమీరిన రాజకీయ జోక్యం ఉంటోంది. దీంతో తీవ్ర అన్యాయం జరుగుతోందని రైతులు వాపోయారు.

2013లో సహకార ఎన్నికలు

సింగిల్ విండోలకు చివరగా 2013లో ఎన్నికలు జరిగాయి. వాటి గడువు 2018లో ముగిసింది. అప్పటినుంచి ఎన్నికలు జరుగలేదు. అప్పట్లో టీడీపీ ప్రభుత్వం సొసైటీల అధ్యక్షుల పదవీకాలాన్ని 2019 వరకు పొడిగించింది. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎన్నికలు ఉంటాయని అందరూ భావించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓటరు జాబితాను కూడా అధికారులు సిద్ధం చేశారు. రూ.10 నుంచి రూ.300 వరకు చెల్లించిన ఓటర్ల సంఖ్య సుమారు ఐదు లక్షలకు పైగా ఉంది. తొలుత వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రకటించినా.. ఆ తర్వాత చొరవ చూపలేదు. అందుకు బదులుగా త్రిసభ్య కమిటీల పాలనను సింగిల్ విండోల్లో ప్రవేశపెట్టింది. ఎన్నికలు లేకపోవడంతో కొన్ని సింగిల్ విండోల్లో త్రిసభ్య కమిటీలు అక్రమాలకు తెరతీశాయన్న ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని చోట్ల రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయన్న విమర్శలున్నాయి.

అడవి మీ అబ్బసొత్తా?

● ఇసుక దందాను అడ్డుకున్న వారిపై ఎంపీటీసీ జులుం

● దౌర్జన్యంగా ఇసుక ట్రాక్టర్లను తీసుకెళ్లిన వైనం

రామకుప్పం, ఫిబ్రవరి 4: రామకుప్పం మండలం గడ్డూరు యానాదికాలనీ అటవీ ప్రాంతంలో ఇసుక దందాను శనివారం అర్ధరాత్రి పలుగ్రామాల ప్రజలు అడ్డుకోవడంతో అధికార పార్టీకి చెందిన ఎంపీటీసీ జులుం ప్రదర్శించారు. 'అడవి మీ అబ్బ సొత్తా' అంటూ వారిపై విరుచుకుపడ్డారు. అటవీ అధికారుల సమక్షంలోనే ట్రాక్టర్లను తీసుకెళ్లిపోయారు. స్థానికులు తెలిపిన ప్రకారం.. గడ్డూరుయానాది కాలనీ అటవీప్రాంతంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధి ఇసుక దందాను యానాదికాలనీ, గోవిందరాజపురం, వినాయకపురం గ్రామస్థులు శనివారం రాత్రి అడ్డుకున్న విషయం తెలిసిందే. అటవీశాఖ అధికారులు రాత్రి 10.30 గంటల ప్రాంతంలో అక్కడకు చేరుకున్నారు. ఇసుక దందాకు అటవీ అధికారులు కొమ్ముకాస్తున్నారంటూ ప్రజలు ఆగ్రహించారు. ఇసుక అక్రమ రవాణాదారులపై కేసులు నమోదు చేసి, ట్రాక్టర్లను సీజ్ చేయాలని డిమాండు చేశారు. ట్రాక్టర్లను ననియాల ఎలిఫెంటు క్యాంపునకు తరలించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి కేసులు నమోదు చేస్తామని వారు చెప్పారు. ఇలా గంటపాటు వాదోపవాదాలు జరిగాయి. రాత్రి 11 గంటలకు 89పెద్దూరు ఎంపీటీసీ వెంకటరమణ తన అనుచరులతో అక్కడకు చేరుకున్నారు. ట్రాక్టర్లను అడ్డుకున్న వారిపై విరుచుకుపడ్డారు. ఇసుక ట్రాక్టర్లను అడ్డుకునేందుకు మీరెవరంటూ దురుసుగా ప్రవర్తించారు. తన అనుచరులతో వారిపై దాడికి పాల్పడ్డారు. అటవీ అధికారుల సమక్షంలోనే ట్రాక్టర్లను అక్కడ్నుంచి తరలించేశారు. కాగా, ఇసుక దందాను అడ్డుకున్న వారిని ఎంపీటీసీ వెంకటరమణ బెదిరిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

ఉద్రిక్త పరిస్థితులతో వచ్చేశాం

శనివారం అర్ధరాత్రి గడ్డూరు యానాదికాలనీ అటవీ ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడంతో తాము వెళ్లామని ముద్దనపల్లె అటవీ బీట్ అధికారి మున్నా ఆదివారం తెలిపారు. ఇసుక అక్రమ రవాణాదారులు, ప్రజల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగి.. ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడంతో వచ్చేశామన్నారు. అక్రమ రవాణాదారులు తీసుకెళ్ళిన ఇసుక ట్రాక్టర్ల కోసం గాలిస్తున్నామన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని, ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇసుక అక్రమ రవాణాకు తాము సహకరిస్తున్నామన్న ఆరోపణలు అవాస్తవమని పేర్కొన్నారు.

ఉభయదారులను నిర్లక్ష్యం చేయొద్దు



మణికంఠేశ్వర స్వామి ఆలయంలో సమావేశమైన ఉభయదారులు

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 4: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి చెందిన 14 గ్రామాల ఉభయదారులను నిర్లక్ష్యం చేయొద్దని ఉభయదారులు తెలిపారు. ఆదివారం ప్రధాన ఆలయానికి అనుబంధ ఆలయమైన మణికంఠేశ్వర స్వామి ఆలయంలో వీరు సమావేశమయ్యారు. ఆలయం దేవదాయ శాఖకు వెళ్లకముందు నుంచి అభివృద్ధికి ఉభయదారులు ఎంతో శ్రమించారన్నారు. ఆలయం వద్ద వినాయక స్వామి చరిత్ర గ్రంథాన్ని ఆవిష్కరించిన సమయంలో ఉభయదారులకు సమాచారం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఆలయ అభివృద్ధికి సంబంధించి ఏ విషయమైనా ఉభయదారులకు తెలియజేయాలని కోరారు. తమను నిర్లక్ష్యం చేస్తే ధర్నా, నిరసన చేపడతామని అధికారులను హెచ్చరించారు.

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

చిత్తూరు, ఫిబ్రవరి 4: కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ షన్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలనుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వినతిపత్రాలను స్వీకరిస్తామని పేర్కొన్నారు. ● జిల్లా పోలీసు కార్యాలయంలోనూ సోమవారం స్పందన సందర్భంగా వినతులు స్వీకరిస్తామని ఎస్పీ జాషువా ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజలు వినతిపత్రాలను అందించవచ్చని సూచించారు.

మంత్రి పెద్దిరెడ్డి వ్యాఖ్యలు సరికాదు : డీసీసీ

వెదురుకుప్పం, ఫిబ్రవరి 4: కాంగ్రెస్ శవాన్ని మోస్తున్న ఆ నలుగురు అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆక్షేపణీయమని డీసీసీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ అన్నారు. ఆదివారం వెదురుకుప్పంలో ఆయన మాట్లాడుతూ.. పెద్దిరెడ్డిలాంటి ఎంతో మందికి రాజకీయభిక్ష పెట్టిన పార్టీ కాంగ్రెస్సేనని గుర్తు చేశారు. అలాంటి పార్టీకి వెన్నుపోటు పొడిచి పదవి కోసం వైఎస్ ప్రమాద మరణాన్ని అడ్డంగా పెట్టుకుని అధికారంలోకి వచ్చింది మీరు కాదా అని ఆయన ప్రశ్నించారు. షర్మిలరెడ్డి కాంగ్రెస్‌లో చేరడాన్ని జీర్ణించుకోలేకుండా మతి భ్రమించి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఆ వ్యాఖ్యలను పెద్దిరెడ్డి వెనక్కి తీసుకోవాలని డిమాండు చేశారు. మీ పార్టీలోని ఎమ్మెల్యేలు, ఎంపీల పనితీరుకు మీరే ఫెయిల్ మార్కులు వేసి మీ ఓటమిని మీరే అంగీకరిస్తున్నారని ఎద్దేవా చేశారు. సంబరాల రాంబాబూ నీ ప్రేలాపనలు ఆపు.. ఇక చాలు అంటూ మంత్రి అంబటి రాంబాబుపై ఆయన మండిపడ్డారు. కోతికి కొబ్బరి చిప్పో లేక కుక్క నోటికి కొబ్బరికాయో రాబోయే ఎన్నికల్లో ప్రజలు తేలుస్తారన్నారు.

భర్తతో కలిసి తల్లిని కడతేర్చిన కూతురు


దాడిలో మృతి చెందిన యర్రక్క

వాల్మీకిపురం, ఫిబ్రవరి 4: భర్త తో కలిసి తల్లిని హత్య చేసిన ఓ కూతురి ఉదంతం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అనంతపురం జిల్లా కనేకల్ గ్రామం తానికి చెందిన యర్రక్క(43) వాల్మీకిపురం ఇందిరమ్మ కాలనీ లో తన కుమార్తె నందిని, శివరాంలతో కలిసి నివాసం ఉంటూ కూలిపనులు చేసుకుని జీవనం సాగిస్తోంది. కుటుంబ కలహాల నేపథ్యంలో శనివారం రాత్రి నందిని, తన భర్త శివరామ్ కలిసి తల్లి యర్రక్కతో గొడవపడ్డారు. అదే సమయంలో ఇనుపరాడ్‌తో యర్రక్కను కొట్టి గాయపరిచారు. గట్టిగా కేకలు విన్న సమీప వాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. యర్రక్కను ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందింది. స్థానిక ఎస్ఐ నాగేశ్వర్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని యువ రైతు మృతి

ములకలచెరువు, ఫిబ్రవరి 4: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ యువ రైతు మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు....సెంట్రల్ స్కూల్ పంచాయతీ నల్లచెరువుపల్లెకు చెందిన రైతు నరేంద్రరెడ్డి(25) సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో బురకాయలకోటకు బయలుదేరాడు. ఈక్రమంలో మార్గం మధ్యంలోరి ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రైతు తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కాగా మృతుడికి భార్య, నాలుగేళ్ళ కమార్తె ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. కాగా యువ రైతు మృతితో గ్రామంలో తీవ్ర విషాధఛాయలు అలుముకున్నాయి.

యువరైతు ఆత్మహత్యాయత్నం

కురబలకోట, ఫిబ్రవరి 4: పురుగుల మందు తాగి యువరైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన ఆదివారం మండలంలో జరిగింది. దీనికి సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మట్లివారిపల్లె పంచాయతీ కొత్తగూడెంపల్లెకు చెందిన ఆనంద్(38) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా కడుపునొప్పి ఎక్కువ కావడంతో తట్టుకోలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు అతడిని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ ముబీన్‌తాజ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ఈబీ తనిఖీల్లో నలుగురు అరెస్టు


కర్ణాటక మద్యం తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చూపుతున్న ఎస్ఈబీ పోలీసులు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 4: మదనపల్లె ఎస్ఈబీ సర్కిల్ పరిధిలో ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ సీఐ రమేశ్‌రెడ్డి తెలిపారు. బి.కొత్తకోట మండలం బడికాయలపల్లె చెక్‌పోస్టు వద్ద ఎస్ఈబీ అధికారులు తనిఖీ చేస్తుండగా ద్విచక్రవాహనంలో వస్తున్న దేగానిపల్లెకు చెందిన ముగ్గురు సి.లక్ష్మిదేవి, సుబ్బరాయుడు, శ్రీనివాసులు ఆపి తనిఖీ చేయగా వారి వద్ద 238 బాటిళ్ల కర్ణాటక మద్యం పట్టుపడిందన్నారు. దీంతో వారిని అరెస్టు చేసి, ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశామన్నారు. అలాగే కురబలకోట మండలం ఎనుములవారిపల్లె వద్ద నాటుసారా విక్రయిస్తున్న చిన్నరెడ్డెప్పరెడ్డిని అరెస్టు చేసి అతని వద్ద 8లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామన్నారు. అతనికి నాటుసారా సరఫరా చేసిన కోటకొండ తాండాకు చెందిన శంకర్‌నాయక్‌పై కేసు నమోదు చేశామన్నారు.

జూదరుల అరెస్టు.. నగదు స్వాధీనం

గుర్రంకొండ, ఫిబ్రవరి 4:జూదరులపై పోలీసులు దాడి చేసి 9 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మర్రిపాడు పంచాయితీ ఉసరికాయలపల్లె సమీపంలో జూదం ఆడుతున్నట్లు తెలియడంతో సిబ్బందితో ఎస్ఐ దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 8 మంది పట్టుబడగా వారి వద్ద నుంచి రూ.5450 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

నిమ్మనపల్లిలో: గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న 5మందిని పట్టుకొని వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ చౌకిళ్లవారిపల్లి సమీపంలో పేకాట ఆడుతుండగా సమాచారం రావడంతో పోలీసులతో దాడులు నిర్వహించి ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.2720లను స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

సామాజిక సత్యాగ్రహ దీక్షకు కాంగ్రెస్ పార్టీ మద్దతు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 4: వీకేసీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించిన సామాజిక సత్యాగ్రహ దీక్షకు కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇచ్చినట్లు పార్టీ నియోజకవర్గ నాయకుడు ఎస్ రెడ్డిసాహెబ్‌నిర్వహించారు. తన అనుచరులతో కలిసి పీటీఎం శివప్రసాద్‌కు సంఘీబావం తెలిపారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రమైనార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కే బాషా, మీనాకుమారి, సురేంద్రరెడ్డి, మహబూబ్‌పీర్, చలపతి, నాగరాజ, ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నెలా ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కలికిరి, ఫిబ్రవరి 4: మండల రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ప్రతి నెలా ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి సి. సురేంద్ర రెడ్డి పేర్కొన్నారు. సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సంఘం గౌరవాధ్యక్షుడు వేంపల్లె అబ్దుల్ ఖాదర్ ప్రారంభించారు. పరీక్షల అనంతరం అవసరమైన వారందరికీ తిరుపతిలో ఉచితంగా శస్త్ర చికిత్సలకు ఏర్పాటు చేస్తామన్నారు. రిటైర్డు ఉద్యోగులందరూ సంఘం ద్వారా చేపట్టే వివిధ రకాల సేవా కార్యక్రమాలకు సహకారం అందించాలని కోరారు. మొత్తం 20 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ముగ్గురిని శస్త్ర చికిత్సల కోసం ఎంపిక చేశారు. కాగా మార్చి నెల 4న తిరిగి వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు సురేంద్ర రెడ్డి తెలిపారు. ఈ శిబిరంలో కంటి వైద్యులు హేమంత్ రెడ్డి, రవీంద్రనాథ రెడ్డి పాల్గొన్నారు. విశ్రాంత ఉద్యోగులు నాగప్ప, బసవయ్య, సుబ్బరాజు శెట్టి, కాంతమ్మ, సరోజమ్మ, నారాయణ రెడ్డి, రామమూర్తి, నారాయణ మూర్తి, వెంకట్రమణ, ఎస్.వెంకట్రమణ, పి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం

- వైసీపీ అరాచక పాలనకు అంతిమ గడియలు
- జయహో బీసీ సదస్సులో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్


చింతపర్తిలో జయహో బీసీ సదస్సులో మాట్లాడుతున్న జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్

వాల్మీకిపురం, ఫిబ్రవరి 4: రాష్ట్రంలో బీసీల సంక్షేమం, అభివృద్ధి టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుతోనేనని అన్నమయ్య జిల్లా టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ పేర్కొన్నారు. ఆదివారం వాల్మీకిపురం మండలంలోని చింతపర్తి ఆర్యవైశ్య కళ్యాణమండపంలో జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బీసీ పట్ల అరాచక ఆలోచనలతో దాడులు, అక్రమ కేసులు తప్ప బీసీలకు మేలు చేసింది శూన్యమన్నారు. అరాచక వైసీపీ పాలనకు అంతిమ గడియలు దగ్గరపడ్డాయన్నారు. బీసీలలోని అన్నీ వర్గాలకు ద్రోహం చేసిన వ్యక్తిగా సీఎం జగన్ చరిత్ర హీనుడయ్యాడని విమర్శించారు. బీసీలపై దాడులు, అక్రమ కేసులు, బెదిరింపుల సైకో జగన్ పరిపాలన రాష్ట్ర ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. రాబోవు ఎన్నికల్లో బీసీలంతా ఏకమై వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడం, నారా చంద్రబాబునాయుడుని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే పీలేరు నియోజకవర్గంలో నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి గెలుపునకు ప్రతి బీసీ చిత్తశుద్ధితో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ కార్యదర్శి జనార్దన్‌గౌడ్, టీడీపీ రాష్ట్ర బీసీ అధికార ప్రతినిధి వల్లిగట్ల వెంకటరమణ, జిల్లా సాధికార అధ్యక్షుడు జ్ఞానశేఖర్, ఉప్పర జిల్లా సాధికార అధ్యక్షుడు వేణుగోపాల్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, పీలేరు టీడీపీ మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్, మాజీ ఎంపీపీ సురేంద్రవర్మ, నాయకులు చంద్రమౌళి, ద్వారకనాథరెడ్డి, పీవీ నారాయణ, శేషాద్రిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కువైట్ ఆది, స్వర్ణలత, కువైట్ సయ్యద్‌బాషా, చాను, డిష్ బ్రదర్స్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానికులతోనే తంబళ్లపల్లె అభివృద్ధి

- పుంగనూరు వద్దు..బెంగళూరు వద్దు..తంబళ్లపల్లె కావాలి
- ఆత్మీయ సమ్మేళనంలో పారిశ్రామిక వేత్త కొండా నరేంద్ర


ఆత్మీయ సమ్మేళన సభలో మాట్లాడుతున్న కొండా నరేంద్ర

బి.కొత్తకోట, ఫిబ్రవరి 4: తంబళ్లపల్లె అభివృద్ధి స్థానికులతోనే సాధ్యమవుతుందని ప్రముఖ పారిశ్రామికవేత్త కొండా నరేంద్ర పేర్కొన్నారు. ఆదివారం బి.కొత్తకోట నగర పంచాయతీలోని కొండా ఎస్టేట్‌లో ఆత్మీయ సమ్మేళనం పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సమ్మేళన సభకు తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీ-జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్రంలోనూ, తంబళ్లపల్లె నియోజవర్గంలోనూ వైసీపీని ఓడించి టీడీపీ-జనసేన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గానికి ఎమ్మెల్యేలుగా పుంగనూరు, బెంగళూరుకు చెందిన వారు వద్దని..తంబళ్లపల్లె అభివృద్ధి స్థానికులతోనే సాధ్యమవుతుందని నరేంద్ర పేర్కొన్నారు. రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన సాగిస్తోందని, అంగళ్లులో జరిగిన అల్లర్లలో 270 మందిపై అక్రమ కేసులు బనాయించారని అందులో రైతులు జైలుకు వెళ్లడంతో పంటలు నష్టపోయారన్నారు. తను కష్టపడి సంపాదించింది ప్రజలకు ఖర్చుపెట్టి సేవ చేసేందుకు క్రియాశీల రాజకీయాల్లోకి వస్తున్నానన్నారు. అంతకు ముందు కొండా ఎస్టేట్ నుంచి జ్యోతి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. పీటీయం, ములకలచెరువు, కురబలకోట, తంబళ్లపల్లె, పెద్దమండ్యం మండలాల టీడీపీ, జనసేన నాయకులు ప్రసంగించారు.

ఆత్మీయ సమ్మేళనం విజయవంతం

ప్రముఖ పారిశ్రామికవేత్త కొండా నరేంద్ర బి.కొత్తకోటలో ఆత్మీయ సమ్మేళనం పేరుతో నిర్వహించిన బహిరంగసభ విజయవంతమైంది. ఇటీవల మడుమూరు వద్ద రైతు చైతన్య సదస్సు పేరుతో ఆయన సభ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాజంపేట పార్లమెంటు నాయకుడు సుగవాసి బాలసుబ్రమణ్యం, ఆరు మండలాలకు చెందిన టీడీపీ- జనసేన నాయకులు చింత కిరణ్‌రాయల్, చంద్రమోహన్, సంపతికోట కిట్టన్న, చక్కిలాలబాబు, కె. వెంకట్రమణ, కేవీరమణ, చావిడికిట్టన్న పాల్గొన్నారు.

పర్యాటకుల భద్రత కోసమే అవుట్‌పోస్టు


హార్సిలీహిల్స్‌లో పోలీసు అవుట్‌పోస్టును ప్రారంభిస్తున్న డీఎస్పీ కేశప్ప

బి.కొత్తకోట, ఫిబ్రవరి 4: పర్యాటకుల భద్రత కోసమే బి.కొత్తకోట మండల పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో పోలీసు అవుట్‌పోస్టును ఏర్పాటు చేస్తున్నట్లు మదనపల్లె డీఎస్పీ కేశప్ప పేర్కొన్నారు. హార్సిలీహిల్స్‌లోని గాలిబండ వద్ద ఆదివారం ఆయన పూజలు చేసి పోలీసు అవుట్‌పోస్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ...పర్యాటకుల రక్షణ కోసం హార్సిలీహిల్స్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గట్టి నిఘా కోసం కోట్ల రూపాయలతో సీసీ కేమెరాలు ఏర్పాటు చేశామన్నారు. అవుట్ పోస్టు హాల్లో సిబ్బంది ఉంటూ గాలి బండతో పాటు, కొండ మీద పర్యాటకులు సంచరించే అన్ని ప్రదేశాలలో నిఘా ఉంచుతామన్నారు. ఆయన వెంట ట్రైనీ డీఎస్పీ ప్రశాంత్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

టీడీపీ పార్లమెంట్ కార్యదర్శిగా రవీంద్ర


టీడీపీ పార్లమెంట్ కార్యదర్శిగా నియమితులైన రవీంద్రను సన్మానిస్తున్న దొమ్మలపాటి రమేశ్, టీడీపీ నాయకులు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 4: రాజంపేట పార్లమెంట్ టీడీపీ కార్యదర్శిగా మదనపల్లె నియోజకవర్గానికి చెందిన జి. రవీంద్రను నియమిస్తూ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మదనపల్లె ఇన్‌చార్జి దొమ్మలపాటి రమేశ్ చేతుల మీదుగా రవీంద్రకు నియామక ఉత్తర్వులు అందజేశారు. రవీంద్ర మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా టీడీపీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. పలువురు రవీంద్రను అభినందించారు.

హిందీ ప్రచారసభ కార్యవర్గంలో హెచ్‌ఎం మహేశ్‌కు చోటు



మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 4: హైదరాబాద్‌లో నిర్వహించిన దక్షిణ భారతదేశ హిందీ ప్రచార సభ కార్యవర్గ సమితిలో మదనపల్లెకు చెందిన ప్రధానోపాధ్యాయుడు ఎల్‌టీ మహేశ్‌కు సభ్యుడుగా చోటు దక్కింది. ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఉమ్మడి ఏపీ(తెలంగాణా, ఆంధ్రప్రదేశ్) కార్యకవర్గంలో 18 మంది సభ్యులుగా నియమితులయ్యారు. వారిలో గూడూరుపల్లె జడ్పీహైస్కూల్ హెచ్‌ఎంగా పనిచేస్తున్న ఎల్‌టీ మహేశ్ సభ్యుడుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయులు, సహచర ఉపాధ్యాయులు మహేశ్‌కు అభినందనలు తెలిపారు

ప్రజాసమస్యలను పరిష్కరించాలి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 4: మదనపల్లె పట్టణంలో ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా ప్రజాప్రతినిదులు, ప్రభుత్వ అధికారులు చర్యలు చేపట్టాని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ అధికార ప్రతినిధి వేల్పుల శ్రీధర్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం మదనపల్లెలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మదనపల్లె పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, దీంతో జనాబా రెట్టింపు పెరిగిందన్నారు. అదే స్థాయిలో సమస్యలు పెరిగిపోతున్నాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా పట్టణంలో గ్రామీణాప్రాంతాల్లో తాగునీటి సమస్య, రోడ్డు సమస్యలు అధికంగా ఉన్నాయన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యతీవ్రంగా మారిందన్నారు. నీరుగట్టువారిపల్లె సిల్క్‌టౌన్‌గా ప్రసిద్ధి చెందిందని, అయితే చేనేత కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతుండడం శోచనీయమన్నారు. టమోటాలు మార్కెట్‌కు తీసుకొచ్చే రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.

మానవహక్కుల కమిషన్ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా పీర్‌బాషా



వాల్మీకిపురం, ఫిబ్రవరి 4: జాతీయ మానవ హక్కుల కమిషన్ (హెచ్ఆర్‌సీ) సౌత్ ఇండియా బోర్డు ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా వాల్మీకిపురంకు చెందిన షేక్ పీర్‌బాషా నియమితులయ్యారు. గతంలో రాష్ట్ర హెచ్ఆర్‌సీ ఉపాధ్యక్షుడిగా ఉన్న పీర్‌బాషా సేవలకు గుర్తింపుగా డెన్మార్క్‌లో సొండర్ బర్గ్‌లోని జాతీయ కార్యాలయం నుంచి ఈ నియామక పత్రం పీర్‌బాషాకు అందింది. నియామక పత్రాన్ని 10సంవత్సరాల చెల్లుబాటుతో జారీ చేశారు. మానవ హక్కులను పరిరక్షించడం, సామాజిక న్యాయాన్ని అభివృద్ధి చేయడం, ఏక చర్యల నుంచి వ్యక్తులను కాపాడటం, హక్కులను చట్టబద్ధంగా అమలు చేయడం, ప్రజలకు హక్కుల గురించి అవగాహన కల్పించడంపై నియామక పత్రంలో పీర్ బాషాకు హెచ్ఆర్‌సీ వారు సూచించారు. ఈసందర్భంగా పీర్‌బాషా మాట్లాడుతూ తన సేవను మానవ హక్కుల జాతి కమిషన్ గుర్తించినందుకు సంతోషంగా ఉందన్నారు. పలువురు ప్రముఖులు, నాయకులు, సంస్థ సభ్యులు పీర్‌బాషాను అభినందించారు.

విద్యాసామగ్రి పంపిణీ


విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న నందకిషోర్

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 4: స్థానిక సీటీఎంరోడ్డులోని గ్రంథాలయ శాఖలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా పాఠకుడు నందకిషోర్ విద్యార్థులకు విద్యాసామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. ఇందులో జామెంట్రీ బాక్స్‌లు, పుస్తకాలు, పెన్నులు విద్యార్థులకు అందజేశారు. ప్రముఖ సైక్రియాట్రిస్టు డాక్టర్ రాధిక మాట్లాడుతూ గ్రంథాలయానికి వచ్చే విద్యార్థులకు ఉచితంగా విద్యాసామగ్రి అందజేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయానికి విచ్చేసి పుస్తకాల పఠనం చేసి ఉన్నతంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో బి.కొత్తకోట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్, గ్రంథాలయ అధికారిణి వసంతకుమారి, ప్రముఖ రచయిత టీఎస్‌ఏ కృష్ణమూర్తి, తిరుపతి రావు, తదితరులు పాల్గొన్నారు.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గుర్రంకొండ, ఫిబ్రవరి 4:గుర్రంకొండ మండలం చెర్లోపల్లెలో కొలువైన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మిగా ప్రసిద్ధి చెందారు. దీంతో అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి అధిక మహిళా భక్తులు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి ఆలయానికి అధికంగా రావడంతో పరిసరాలు రద్దీగా మారాయి. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ.25 వేల విరాళం

గుర్రంకొండ మండలం చెర్లోపల్లె రెడ్డెమ్మకొండ ఆలయ పునర్నిర్మాణానికి దాతలు విరాళం ఇచ్చారు. ఇందులో భాగంగా చిత్తూరు జిల్లా సదుంకు చెందిన కదిరప్ప రూ.25,116 నగదును ఈవో మంజులకు అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయాభివృద్ధికి వినియోగించాలని కోరారు. దాతలకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

తంబళ్లపల్లెలో నేడు జయహో బీసీ సదస్సు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 4: తంబళ్లపల్లె మండల కేంద్రంలో సోమవారం నిర్వహించనున్న మండల స్థాయి జయహో బీసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తంబళ్లపల్లె టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి తంబళ్లపల్లె టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్ హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి టీడీపీ-జనసేన నాయకులు, కార్యకర్తలు మండల, గ్రామ, బూత్ స్థాయి కన్వీనర్లు, అన్ని విభాగాల నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

రాష్ట్రాన్ని గంజాయి రాజధానిగా మార్చివేశారు

- టీడీపీ రాజంపేట పార్లమెంటు అధి కార ప్రతినిధి కోటపల్లె బాబురెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కోటపల్లె బాబు రెడ్డి, తదితరులు

పీలేరు, ఫిబ్రవరి 4: అన్నపూర్ణ అయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని వైసీపీ నాయకులు గంజాయి రాజధానిగా మార్చివేశారని తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి కోటపల్లె బాబురెడ్డి పేర్కొన్నారు. పీలేరులోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు పెద్దపెద్ద పట్టణాలకే పరి మితమైన గంజాయి వ్యాపారం నేడు మారుమూల గ్రామాలకు విస్తరించిందని, తమ స్వలాభం కోసం అధికార పార్టీ నాయకులు హైస్కూల్ విద్యార్థులతో కూడా గంజాయి వ్యాపారం చేయిస్తున్నారని ఆరోపించారు. అధికార పార్టీ నాయకుల జోక్యం ఉండడంతో పోలీసులు కూడా అందులో భాగస్వామ్యులైనట్లు ఉన్నారని కోటపల్లె బాబురెడ్డి తెలిపారు. ఇటీవల హైదరాబాదులో 22 కిలోల గంజాయితో కాకినాడకు చెందిన స్పెషల్ బెటాలియన్ పోలీసులు పట్టుబడడం ఇందుకు సజీవ సాక్ష్యమన్నారు. చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి పోలిశెట్టి సురేంద్ర మా ట్లాడుతూ టీడీపీ, జనసేన కూటమికి పట్టం కట్టేందుకు రాష్ట్ర ప్రజలు ఇప్పటికే నిర్ణయిం చుకున్నారని, వైసీపీ నాయకుల కుట్రలు నమ్మే స్థితిలో లేరన్నారు. సమావేశంలో నాయకులు కంచి సూరి, లక్ష్మీకర, శ్రీకాంత్ రెడ్డి, పురం రామ్మూర్తి, షామియాన జయన్న, మహమ్మద్ పీర్, ఇర్షాద్, హరి, ముబారక్, పురుషోత్తంరెడ్డి, శ్రీనాథరెడ్డి, విజయకుమార్ పాల్గొన్నారు.

బీసీల రక్షణ, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం


బీసీ సభలో సంఘీభావం తెలుపుతున్న దొమ్మలపాటి, టీడీపీ బీసీ నాయకులు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 4: రాష్ట్రంలో బీసీల రక్షణ, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని మదనపల్లె టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మదనపల్లె పట్టణం, మండలానికి సంబంధించి జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథి గా హాజరైన దొమ్మలపాటి మాట్లాడుతూ టీడీపీని స్థాపించిన ఎన్టీ రామారావు రాజకీయంగా బీసీలకే అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. కులవృత్తులను ప్రోత్సహిస్తూ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు అన్ని రంగాల్లో రిజర్వేషన్లు కల్పించారన్నారు. చంద్రబాబునాయుడు సీఎంగా బీసీల జీవనోపాధికి అనేక కార్యక్రమాలు నిర్వహించారన్నారు. అందేకే బీసీలు జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు శ్రీరామ రామాంజనేయులు, దారం హరి, రాజంపేట పార్లమెంట్ బీసీ విభాగం అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్, పట్టణ, మండల అధ్యక్షుడు భవానిప్రసాద్, దేవరింటి శ్రీనివాసులు, మోడెం సిద్దప్ప, నాగయ్య, వెంకటరమణ, రెడ్డిశేఖర్, జనార్ధన్‌గౌడ్, సుధాకర్, దుర్గాప్రసాద్, ప్రభాకర్, గణపతి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

కోడి కత్తి శీనుకు న్యాయం చేయాల్సిందే..

- దళిత, గిరిజన, బీసీ సంఘాల నేతల డిమాండ్


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది చిన్నరెడ్డప్ప

పీలేరు, ఫిబ్రవరి 4: కోడి కత్తి శీనుకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని దళిత, గిరిజన, బీసీ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. కోడి కత్తి శీనుకు న్యాయం చేయాలంటూ ఆదివారం పీలేరులో ఎమ్మార్పీఎస్ నాయకుడు సుధాకర్ నేతృత్వంలో దళిత, గిరిజన, బీసీ సంఘాల నేతలు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీలేరులోని సీనియర్ న్యాయవాది చిన్నరెడ్డప్ప మాట్లాడుతూ కోడి కత్తి శీను వ్యవహారంలో రాజ్యాంగ, చట్టబద్ధంగా వ్యవహరించాల్సిన బాధ్యత ప్రభుత్వం, ప్రభుత్వాధినేతపై ఉందన్నారు. మాలమహానాడు నాయకుడు గుర్రం నారాయణ, ఎమ్మార్పీఎస్ నాయకులు సుధాకర్, ముల్లంగి చంద్రయ్య, సీపీఐ నాయకుడు టీఎల్ వెంకటేశ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు అమృతతేజ, రాష్ట్ర గిరిజన సమాఖ్య నాయకుడు కిల్లా విజయ్ కుమార్ మాట్లాడుతూ శీను దళితుడు అయినందు వల్లే అతనికి న్యాయం జరగడం లేదన్నారు. శీను ఉదంతంలో ఎటువంటి కుట్ర కోణం లేదని దేశ అత్యున్నత విచారణ సంస్థ అయిన ఎన్ఐఏ తేల్చి చెప్పినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. తనకు ఎస్సీలపై ఎంతో ప్రేమ అని చెప్పుకునే ముఖ్యమంత్రి జగన్, శీను విషయంలో సమాధానం చెప్పాలన్నారు. అతనికి, అతని కుటుంబానికి న్యాయం జరిగే వరకు సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సద్దల ప్రేమ్‌కుమార్, సాయిసంపత్, అమృతపూరి అశోక్ సామ్రాట్, కొత్తకోట ప్రసాద్, తిమ్మయ్య, కుమార్, కొండయ్య, రవి, శేషాద్రి, రవితేజ, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

సోమల ప్రాంతం వైపు వెళ్లిపోయిన ఏనుగులు

కలికిరి, ఫిబ్రవరి 4: వాల్మీకిపురం, కలికిరి మండలాల సరిహద్దు గ్రామాల్లో రెండు రోజులపాటు కలకలం సృష్టించిన రెండు గున్న ఏనుగులు ఆదివారం సాయంకాలానికి ఇక్కడి నుంచి సోమల వైపు వెళ్లిపోయాయి. ఈ విషయాన్ని అటవీ శాఖాధికారులు కూడా ధృవీకరించారు. చిత్తూరు జిల్లాలోని సోమల మండలానికి చెందిన నంజంపేట, రాంపల్లె, ఆవులపల్లె, సింగిరిగుంట, ఇరికిపెంట గ్రామాల పరిధిలోని మధురమల్లె రిజర్వు ఫారెస్టు ప్రాంతాలకు చేరుకున్నాయని సమాచారంతో వాల్మీకిపురం, కలికిరి సరిహద్దు గ్రా మాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. సోమల అటవీ ప్రాంతంలో వున్న ఏనుగుల గుంపు నుంచి ఈ రెండు గున్న ఏనుగులు కలికిరి, వాల్మీ కిపురం సరిహద్దు గ్రామాల్లోని అటవీ ప్రాంతంలోనికి చొరబడినట్లు ఆ శాఖ అధికారులు భావిస్తున్నారు. ఆదివారమంతా మేకలవారిపల్లె, ఇట్లంవారిపల్లె కొత్తపల్లె ప్రాంతాల్లో సంచరించిన ఏనుగులు గుట్టపాళెం పంచాయతీ ఆచార్ల గొల్లపల్లె వైపు నుంచి సోమల అటవీ ప్రాంతంలోకి వెళ్లినట్లు కూడా అధికార వర్గాల సమాచారం.

ఏనుగుల రాకతో ప్రజలు ఆందోళన

వాల్మీకిపురం, ఫిబ్రవరి 4: మండలంలోని మేకలవారిపల్లె, చారావాండ్లపల్లె ప్రాంతాలలో శనివారం రెండు ఏనుగుల సంచారంతో గ్రామాల ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. గ్రామాల పరిసరాలలోని వ్యవసాయ పొలాలలో ఏనుగుల అడుగులు, పంటలు నాశనం చేయడం చూసి రైతులు తీవ్ర ఆవేదన చెందారు. శనివారం అర్ధరాత్రి దాకా గ్రామాల ప్రజలు ఫారెస్టు అధికారులతో కలిసి ఏనుగులను అటవీ ప్రాంతం వైపు తరిమేసేలా ప్రయత్నాలు సాగించారు. అయితే మళ్లీ తిరిగి గ్రామాలలోకి ఏనుగులు వస్తాయేమోనని గ్రామస్థులు భయాం దోళనలు వ్యక్తం చేస్తున్నారు.

బ్యానర్ ఏర్పాటు విషయంలో వివాదం


బెంగళూరు బస్టాండ్‌లో బ్యానర్ ఏర్పాటును అడ్డుకుంటున్న దృశ్యం

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 4: స్థానిక బెంగళూరు బస్టాండ్‌లోని ఇందిరమ్మ సర్కి ల్‌లో ఏర్పాటు చేసిన ఓ బ్యానర్ విష యంలో కాంగ్రెస్, టీడీపీ కార్యకర్తల మధ్య వివాదం చోటు చేసుకుంది. ఆదివారం కాంగ్రెస్ పార్టీ నియోజ.కవర్గ నాయకుడు రెడ్డిసాహెబ్ ఆధ్వర్యంలో టీడీపీ బ్యానర్స్ తొలగించడానికి ఉపక్రమించారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు బెంగ ళూరు బస్టాండ్ చేరుకుని టీడీపీ బ్యానర్స్‌ను తొలగిస్తారా? అంటూ అక్కడ ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ బ్యానర్స్‌ను తొలగించే ప్రయత్నం చేశారు. అప్పటికే అక్కడే ఉన్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కలగజేసుకుని టీడీపీ కార్యకర్తలను అడ్డుకున్నారు. దీంతో టీడీపీ, కాంగ్రెస్ నాయకుల మధ్యలో వాదోపవాదాలు జరిగాయి. మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా అక్కడకు చేరుకోవడంతో నాయకుల వివాదం సర్దుమనిగింది. అనంతరం కాం గ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు రెడ్డిసాహెబ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ బ్యానర్‌ను తిరిగి ఇందిరమ్మ సర్కిల్‌లో ఏర్పాటు చేసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రమైనార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కేబాషా, మీనాకుమారి, సురేంద్రరెడ్డి, చలపతి, బయ్యారెడ్డి, మహబూబ్‌పీర్, మహమద్‌అలీ, ఈశ్వరమ్మ, నాగరాజ, సయ్యద్, వెంకటరమణ, షఫీ, సమీర్, తదితరులు పాల్గొన్నారు.

వెలుగు విద్యార్థులకు.. మిట్స్ విద్యార్థుల చేయూత


వెలుగు విద్యార్థులకు విద్యా సామగ్రి అందిస్తున్న మిట్స్ విద్యార్థులు

కురబలకోట, ఫిబ్రవరి 4: మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు మదనపల్లె సమీపంలోని వెలుగు అనాథ శరణాలయ విద్యార్థులకు చేయూతనందించారు. ఆదివారం కళాశాలలో ఎంసీఏ విభాగానికి చెందిన విద్యార్థులు 100మంది విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేశారు. అలాగే వాటితో పాటుగా రూ.18,650 విలువ చేసే బియ్యం బస్తాలు, పిల్లలు ఆడుకునే బొమ్మలను పంపిణీ చేశారు. అలాగే విద్యార్థులకు తమవంతు సహాయసహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.